
# హరోం హర...హరోం హర..!

## ● నేత్రపర్వంగా తిరుచెందూరు ఆలయ కుంభాభిషేకం



పచ్చజెండా ఊపి సంప్రోక్షణ ప్రారంభిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు - (ఇన్‌సెట్‌లో) గర్భాలయంపై కలశాలకు పూజలు

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయ మహా కుంభాభిషేక వేడుకలు సుమారు ఐదు లక్షలమంది భక్తుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలను తిలకించేందుకు దేశవిదేశాల నుండి తరలి వచ్చిన భక్తులతో తిరుచెందూరు క్షేత్రం కిటకిటలాంది. 16 యేళ్ల తర్వాత ఈ మహాకుంభాభిషేక వేడుకలు ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. స్వామివారి ప్రధానాలయ రాజగోపురం కలశాలపై, పరివార దేవాతామూర్తుల విమానాల కలశాలపై వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ సంప్రోక్షణ జరిగింది.. దేశంలోని వివిధ పుణ్యనదుల నుంచి తీసుకొచ్చిన పవిత్రజలాలతో వేదపండితులు, అర్చకులు రాజగోపురం, ఇతర గోపురాల పైకి వెళ్ళి, గోపురాల కలశాలపై సంప్రోక్షణకార్యక్రమాలను నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో రెండవదైన ఈ ఆలయంలో హెచ్‌సీఎల్ సంస్థ రూ.200 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు ముగిశాయి. ఇదే విధంగా రాష్ట్ర దేవాదాయ శాఖ ఆలయ మహాకుంభాభిషేక వేడుకల నిర్వహణ కోసం రూ.100 కోట్లు కేటాయించింది. యేడాది పాటు ఆలయ జీర్ణోద్ధరణ, విస్తరణ పనులు, వసతి గృహాల నిర్మాణ పనులు జరిగాయి. అన్నీ పూర్తయిన తరువాత మహాకుంభాభిషేక వేడుకలు జూన్ 26న గణపతి పూజలతో ప్రారంభం కాగా, ఈ నెల ఒకటో తేదీ సాయంత్రం యాగశాల పూజలు ఆరంభమయ్యాయి. కరియమాణిక్య వినాయకుడు, పార్వతీదేవి, మూలవర్లు, వళ్ళి, దైవానై ఆలయం లోపల తంత్రి సుబ్రమణియరు నాయకత్వంలో స్వామి షణ్ముగనాధుడు, పరివార మూర్తులకు రాజగోపురం కింద యాగశాలలో 71 హోమ గుండాలు ఏర్పాటు చేశారు. 700 కుంభాలను అమర్చి 96 రకాల మూలికలతో పిచ్చై శివాచార్యుల నాయకత్వంలో సెల్వం శివచార్యులు, తిరుప్పరంకుండ్రం రాజా శివాచార్యులు, తిరుచెందూరు శివాచార్యులు పూజలు నిర్వహించారు. గత శనివారం సాయంత్రం నుండి తిరుకల్యాణ మండపంలో పెరుమాళ్‌కు ప్రత్యేకంగా ఐదు హోమ గుండాలు ఏర్పాటు చేసి యాగశాల పూజలు జరిపారు. ఈ నేపథ్యంలో సోమవారం వేకువజాము నాలుగు గంటలకు ద్వాదశ యాగశాల పూజలు, మహాదీపారాధన జరిగాయి. 5.35 గంటలకు యాగశాలల వద్ద పవిత్రనదీజలాల కుంభాల (ఇత్తడి బిందెల)ను ఆలయ గోపురాల విమానాలపైకి తీసుకెళ్ళారు. ఉదయం 6.22 గంటలకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ రాజగోపుర కలశాలకు సంప్రోక్షణ చేయడానికి పవిత్ర నదీజలాల స్వర్ణ కుంభాన్ని తీసుకెళ్ళి, అందులోని జలాలతో ప్రత్యేక పూజలు, దీపారాధన జరిపారు.

### లాడ్జీల్లో పెరిగిన అద్దెలు...

కుంభాభిషేకానికి లక్షలాదిమంది భక్తులు తరలిరావటంతో తిరుచెందూరు నగరంలోని లాడ్జీలు, రెస్టారెంట్లలో రోజువారీ అద్దె విపరీతంగా పెంచారు. సింగిల్‌బెడ్, డబుల్ బెడ్‌రూమ్‌లను రూ.3 వేల నుండి రూ.8వేలు పెంచడంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారు.

### డ్రోన్ల సాయంతో భక్తులపై పవిత్ర జలాలు...

సంప్రోక్షణ ముగియగానే 20 డ్రోన్ల ద్వారా ఆలయ గోపురాల దిగువనున్న భక్తులపై పవిత్ర జలాలను చల్లారు. ఇదే విధంగా ఈ వేడుకలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీసీ కెమెరాలు అమర్చి, డ్రోన్ల ద్వారా పోలీసులు పర్యవేక్షించారు. ఈ వేడుకల్లో మంత్రులు పీకే శేఖర్‌బాబు, అనితా ఆర్ రాధాకృష్ణన్, జిల్లా కలెక్టర్ కె.ఇలంభగవత్ శృంగేరి శ్రీశారదా పీఠాధిపతి జగద్గురు భారతి తీర్థ మహాసన్నిధానం, తిరుకైలాయ పరంపర ధర్మపురం ఆధీన గురుమహాసన్నిధానం మాసిలామణి దేశిక జ్ఞాన సంబంధ పరమాచార్య స్వామి, కందపురి ఆధీనం వామదేవ స్వామినాథ దేశిక స్వామి, కేంద్రమాజీమంత్రి పొన్ రాధాకృష్ణన్, ఆలయ ట్రస్టీ అరుళ్‌మురుగన్ తదితరులు పాల్గొన్నారు. సంప్రోక్షణ జరుగుతున్న సమయంలో ఆలయ పరిసరాల్లో, సముద్రతీరం వద్ద గుమికూడిన లక్షలాదిమంది భక్తులు 'వెట్రివేల్ మురుగనుక్కు హరోంహరా.. హరోంహరా' అంటూ నినాదాలు చేశారు. ఈ కుంభాభిషేక వేడుకలను భక్తులు వీక్షించేలా ఆలయ పరిసరాల్లో 70 భారీ సైజు ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఏడీజీపీ డేవిడ్‌సన్ ఆశీర్వాదం నేతృత్వంలో సుమారు 6 వేల మంది పోలీసులతో భక్తులకు భద్రత కల్పించారు. ఇదిలా ఉండగా కుంభాభిషేకం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నిలిపివేసిన దర్శనాలు, సోమవారం మధ్యాహ్నం 2 నుండి అనుమతించారు. ఈ కుంభాభిషేక వేడుకల సందర్భంగా కేంద్రమంత్రి ఎల్.మురుగన్ ఆలయనిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. పకడ్బందీ ఏర్పాట్ల నడుమ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా వేడుకలను నిర్వహించినందకు అభినందనలు తెలియజేశారు.

### జపాన్ భక్తుల పారవశ్యం...

ఈ వేడుకలను తిలకించడానికి జపాన్, మలేసియా, సింగపూరు దేశాల నుంచి భక్తులు తరలివచ్చారు. వీరంతా రెండు రోజులకు ముందే తిరుచెందూరు చేరుకుని బసచేశారు. సోమవారం వేకువజామున స్థానిక భక్తులతో కలిసి సముద్ర స్నానాలు చేశారు.. ఆ తర్వాత తమిళ సంప్రదాయిక దుస్తులు ధరించి కుంభాభిషేక వేడుకలో పాల్గొన్నారు. ఈ వేడుకలను 25 మంది జపాన్ భక్తులు వీక్షించారు.




---

శ్రీలంక తమిళుల కోసం

# 729 నివాస గృహాలు

## ● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పునరావాస కేంద్రాల్లో ఉంటున్న శ్రీలంక తమిళుల కోసం కొత్తగా నిర్మించిన నివాసగృహాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. సచివాలయంలో సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో విల్లుపురం, తిరుప్పూరు, సేలం, ధర్మపురి, విరుదునగర్ జిల్లాల్లోని శ్రీలంక తమిళుల పునరావాస కేంద్రాల్లో రూ.38.76 కోట్లతో నిర్మించిన 729 నివాసగృహాలను ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. విల్లుపురం జిల్లా కీళ్‌పుత్తుపట్టు, తిరుప్పూరు జిల్లా తిరుమూర్తి నగర్, సేలం జిల్లా తమ్మంపట్టి, ధర్మపురి జిల్లా నాగావతి డ్యామ్, కేసరికుళి డ్యామ్ ప్రాంతాలు, విరుదునగర్ జిల్లా కండియాపురం వద్దనున్న శ్రీలంక తమిళుల పునరావాస కేంద్రాల వద్ద ఈ నివాస గృహాలను నిర్మించినట్లు స్టాలిన్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో రూ.7.33 కోట్లతో రహదారి, విద్యుత్, మురుగునీటి కాల్వలు, తాగునీటి సదుపాయం వంటి సౌకర్యాలు కూడా కల్పించినట్లు తెలిపారు.

### ధర్మపురి కలెక్టరేట్‌లో అదనపు భవనాలు...

సచివాలయంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ధర్మపురి జిల్లా కలెక్టరేట్ వద్ద రూ.36.62 కోట్లతో నిర్మించిన అదనపు భవనసముదాయాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఇదే విధంగా రూ.17.52 కోట్లతో నిర్మించిన సబ్‌కలెక్టర్ కార్యాలయాలు, రూ.65.76లక్షలతో నిర్మించిన ఆర్‌ఐ కార్యాలయం, క్వార్టర్స్ భవనాలకు కూడా ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమాలలో మంత్రులు కేకేఎస్ఎస్ రామచంద్రన్, ఎస్ఎం నాజర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం తదితరులు పాల్గొన్నారు.

### 10శాఖల పనితీరుపై సీఎం సమీక్ష...

యువజన సంక్షేమం, ఉన్నత విద్య, రవాణా, మైనారిటీ, పాఠశాల విద్య, ఆదిద్రావిడ సంక్షేమం, కార్మిక సంక్షేమం తదితర మంత్రిత్వ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి స్టాలిన్ సమీక్ష జరిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ఆయా శాఖల మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

**9న తిరువారూరులో సీఎం పర్యటన**

ప్రభుత్వ శాఖల పనితీరును స్వయంగా పరిశీలించేందుకు సీఎం స్టాలిన్ ఈ నెల 7న తిరువారూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఆ సందర్భంగా పలుచోట్ల రోడ్ షోలో కూడా నిర్వహించనున్నారు. తిరువారూరు రైల్వేస్టేషన్ సమీపంలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహాన్ని కూడా ఆవిష్కరించనున్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నివాసాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

---

## ఇరాన్ నుంచి చెన్నై చేరుకున్న జాలర్లు

### ● స్వాగతించిన నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ చేసిన ప్రయత్నంతో యుద్ధం కారణంగా ఇరాన్ దేశంలో చిక్కుకుని ఇబ్బందుల పాలైన తమిళ జాలర్లు 15 మంది సురక్షితంగా ఆదివారం రాత్రి నగరానికి చేరుకున్నారు. తిరునల్వేలి జిల్లాకు చెందిన వీరిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ విమానాశ్రయంలో సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఉద్యోగావకాశాలు, వృత్తిరీత్య విదేశాలకు వెళ్లి ఆ ప్రాంతాల్లో చిక్కుకున్న తమిళులు, ప్రవాస భారతీయులను విడిపించి నౌకా, విమానాల ద్వారా స్వదేశానికి రప్పించడంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపడుతోందని, మరో రెండ్రోజుల్లో ఇరాన్ నుండి మరో 15 మంది తమిళ జాలర్లు కేంద్రప్రభుత్వ చొరవతో నగరానికి రానున్నట్లు ఆయన తెలిపారు.



జాలర్లతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

---

# వైభవంగా నాథదీశ్వరాలయ కుంభాభిషేకం

తిరుత్తణి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని కరింబేడు గ్రామంలో సుమారు 1,500 యేళ్ళ చరిత్ర కలిగిన జ్ఞానాంబిక సమేత నాథదీశ్వరాలయ కుంభాభిషేక మహోత్సవం సోమవారం ఉదయం ఘనంగా జరిగింది. గత నెల 23న ప్రారంభమైన ఈ ఆలయ వేడుకలు సోమవారం కుంభాభిషేకంతో ముగిశాయి. పదహారు రోజులుగా యాగశాలలో శివాచార్యుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. చివరి రోజైన సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు యాగపూజలు, పూర్ణాహుతి జరిగాయి. ఉదయం 7 గంటలకు వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ పవిత్ర జల కలశాలను ఊరేగింపుగా క్షేత్రానికి తరలించారు. అనంతరం ఆ పుణ్య జలాలను ఆలయ గోపుర కలశాలపై సంప్రోక్షించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ముఖ్యఅతిథిగా హాజరై ఏర్పాట్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.



కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఆలయ నిర్వాహకులతో ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ తదితరులు



పాల్గొన్న భక్తులు

---

# నేనూ రైతునే...

## ప్రజల పక్షానే అన్నాడీఎంకే

### ● కోవై జిల్లాలో పర్యటన ప్రారంభించిన ఈపీఎస్

ప్యారీస్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): 'నేనూ రైతునే.. ఇప్పటికీ మా కుటుంబ ప్రధాన వృత్తి వ్యవసాయమే... అన్నదాతల కష్టాలు తెలుసు... రాష్ట్ర ప్రజల పక్షానే అన్నాడీఎంకే ఉంటుంది' అని ప్రతిపక్షనేత, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రప్రజల సమస్యల తెలుసుకునేందుకు, 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' (ప్రజలను కాపాడుదాం-రాష్ట్రాన్ని విడిపిద్దాం)అనే నినాదంతో ఎడప్పాడి పళనిస్వామి సోమవారం తన పర్యటనను కోవై జిల్లా మేట్టుపాళయంలో ప్రారంభించారు. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో దివంగత మాజీముఖ్యమంత్రి జయలలిత కోవై జిల్లా నుంచే తన ప్రచారాన్ని ప్రారంభించి అధికారం చేజిక్కించుకున్నారు. ఆమె బాటలోనే ఈపీఎస్ కూడా ఇక్కడి నుంచే తన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టడం గమనార్హం. ఉదయం 8 గంటలకు తేక్కంపట్టిలో ఉన్న వన భద్రకాళియమ్మన్ ఆలయంలో పార్టీ నేతలతో కలిసి ఈపీఎస్ స్వామివార్లను దర్శించుకున్నారు. ఆ తర్వాత ఆ ప్రాంతంలోవున్న కల్యాణ మండపంలో మాజీమంత్రి, పార్టీ విప్ ఎస్పీ వేల్‌మణి ఏర్పాటు చేసిన సమావేశంలో ఈపీఎస్ పాల్గొన్నారు. రైతులు, నేతకార్మికులు, ఇటుక బట్టీల ఉత్పత్తిదారులు, వన్య మృగాల వల్ల కష్టాలు పడుతున్న గ్రామీణ ప్రజల నేతలతో తొలి సమావేశం నిర్వహించారు.

తొలి సమావేశంలో పాల్గొన్నవారితో ఈపీఎస్ మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువుల్లో పూడికతీయించి సాగునీరు, తాగునీటి కొరతలేకుండా చేసింది ఒక్క అన్నాడీఎంకే ప్రభుత్వం మాత్రమేనని, తానూ రైతునేనని అందువల్లే అన్నదాతల కష్టాలన్నీ తనకు తెలుసన్నారు. తాను 2019లో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నీటి శుద్ధీకరణ పథకానికి రూ.11,500 కోట్లు కేటాయించానని, ప్రధానిని సంప్రదించి 'నడందాయ్ వాలి కావేరి' అనే పథకం గురించి వివరించి అవసరమైన నిధులు పొందడం జరిగిందని ఈపీఎస్ తెలిపారు. అదేవిధంగానే కోవై, తిరుప్పూర్ జిల్లాల్లో కరువు ప్రాంతాలకు చెందిన రైతుల సంక్షేమార్థం అత్తికడవు-అవినాశి జలపథకాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుండగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆ పథకం ఆగిపోయిందన్నారు. తాము అన్నాడీఎంకే ప్రభుత్వ ఏర్పడ్డాక ఈ పథకాన్ని కూడా కేంద్రప్రభుత్వ సహకారంతో తప్పకుండా అమలు పరస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమార్థం తమ పాలనలో త్రీఫేస్ కరెంటు ఉచితంగా ఇచ్చామని, ముఖ్యంగా అటవీ ప్రాంతాల సమీప గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలు వన్యమృగాల వల్ల ఏర్పాడే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరింపజేసి, మృతిచెందిన వారికి నష్టపరిహారం కూడా అందజేసినట్లు ఈపీఎస్ తెలిపారు.



తేక్కంపట్టి సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

### డీఎంకే పాలనలో...

రాష్ట్రంలో 2021లో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్ళలో అన్నదాతలు, నేతకార్మికులు, ఇటుకబట్టీల ఉత్పత్తిదారులు ఇలా అన్ని వర్గాలకు ప్రజలు ధరల పెంపు, ఆస్తి పన్ను, నీటిపన్ను, వృత్తిపన్ను, విద్యుత్ ఛార్జీల పెంపుతో ఆర్థిక భారం పెరిగి సతమతమవుతున్నారని ఈపీఎస్ విమర్శించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అన్నాడీఎంకేకు అధికారం అప్పగిస్తే మూసివేసిన ఇటుక బట్టీలను మళ్ళీ ప్రారంభించడం, ఉచిత గృహ నిర్మాణం పథకాన్ని తిరిగి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈపీఎస్ సమావేశంలో మాజీ కేంద్రమంత్రి తంబిదురై, మాజీమంత్రి డాక్టర్ ఎస్ఎం వేలుస్వామి, అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు, బీజేపీ తరుపున ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

### ఈపీఎస్ యాత్రలో చేతివాటం...

ఈపీఎస్ పాల్గొన్న సమావేశం హాలు బయట కోవై జిల్లాకు చెందిన అన్నాడీఎంకే నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో గుమిగూడారు. ఈ రద్దీని ఆసరాగా తీసుకుని ముగ్గురి వద్ద దాదాపు రూ.2లక్షల వరకు చోరీ జరిగినట్లు మేట్టుపాళయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీ చేసి పరారైన వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## సమాచార దర్శిని

### 11 నుంచి మేట్టుపాళయం-ఊటీ మధ్య అదనపు రైలు

వాషర్‌మెన్‌పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పర్యాటకుల సౌకర్యార్థం మేట్టుపాళయం-ఊటీ మధ్య ఈ నెల 11 నుంచి ఆగస్టు 17వ తేది వరకు శుక్ర, ఆదివారాల్లో ప్రత్యేక కొండ రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయి. అలాగే, ఈ నెల 12 నుంచి ఆగస్టు 12వ తేది వరకు శని, సోమ వారాల్లో ఊటీ-మేట్టుపాళయం మధ్య ప్రత్యేక కొండ రైలు సేవలు ఉంటాయని సేలం రైల్వే డివిజన్ ఒక ప్రకటనలో తెలిపింది.

### భారీగా పెరిగిన విమాన ఛార్జీలు

పెరంబూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ముహర్రాల రోజులు కావడంతో ఈ నెల 11,12 తేదీల్లో విమాన ఛార్జీలు భారీగా పెరిగాయి. ఆ ప్రకారం, సాధారణ రోజుల్లో చెన్నై-మదురై మధ్య ఛార్జీ ఒక వ్యక్తికి రూ.4,000 వసూలు చేస్తుండగా, ప్రస్తుతం రూ.13,000-రూ.16,000 వరకు వసూలుచేస్తున్నారు. అలాగే, చెన్నై-తూత్తుకుడి మధ్య రూ.5,300గా ఉన్న ఛార్జీ రూ.9,360-రూ.10,993గా, రూ.3,500 ఉన్న చెన్నై-కోవై ఛార్జీ రూ.6,000-రూ.10,500, రూ.3,500-రూ.4,800 వరకు ఉన్న చెన్నై-కొచ్చిన్ ఛార్జీ రూ.10,500, రూ.5,150గా ఉన్న చెన్నై-తిరువనంతపురం ఛార్జీ రూ.11,200 వరకు పెరిగాయి.

### వస్త్రాభరణాలు, పూజా సామగ్రి తయారీపై శిక్షణ

పెరంబూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10,11 తేదీల్లో పూజా సామగ్రి, వస్త్రాభరణాలపై శిక్షణ ఇవ్వనున్నారు. స్థానిక గిండి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని అగ్రి-టెక్ గ్రీన్ పార్క్‌లో ఉన్న వ్యవసాయం విశ్వవిద్యాలయ సమాచార శిక్షణా కేంద్రంలో వస్త్ర ఆభరణాలు, పూజా వస్తువుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్న వారు మరిన్ని వివరాలకు 044-29530048 అనే నెంబరు సంప్రదించవచ్చు.

### సమన్వయ కమిటీ సభ్యులుగా దివ్యాంగులకు ఆహ్వానం

పెరంబూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల జిల్లా సమన్వయ కమిటీ సభ్యులుగా దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగుల సంక్షేమార్థం, దక్షిణ చెన్నై జిల్లాకు జిల్లా స్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటుకానుంది. ఈ కమిటీ సభ్యులుగా ప్రాతినిధ్యం వహించేందుకు అంధులు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు డీఎంఎస్ ప్రాంగణంలోని జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం 044-24714758 అనే నెంబరు సంప్రదించవచ్చని జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

### నేడు, 10న చెన్నై-గుమ్మిడిపూండి సబర్బన్ రైళ్ల పాక్షిక రద్దు

పెరంబూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8, 10వ తేదీల్లో చెన్నై సెంట్రల్-గూడూరు సెక్షన్ పరిధిలో పలు రైళ్లు పాక్షింగా రద్దు చేసినట్టు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. గుమ్మిడిపూండి-పొన్నేరి స్టేషన్ల మధ్య రైలు మార్గాల్లో మరమ్మతులు కారణంగా మూర్‌మార్కెట్ కాంప్లెక్-గుమ్మిడిపూండి-సూళ్లూరుపేట, చెన్నై బీచ్-గుమ్మిడిపూండి, సూళ్లూరుపేట-నెల్లూరు మధ్య ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు 24 రైళ్లు రద్దుచేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఆ సమయాల్లో మూర్ మార్కెట్ కాంప్లెక్-పొన్నేరి-మూర్ మార్కెట్ కాంప్లెక్స్, మూర్ మార్కెట్ కాంప్లెక్స్-మీంజూరు-మూర్ మార్కెట్ కాంప్లెక్స్, మూర్ మార్కెట్ కాంప్లెక్-ఎన్నూర్-మూర్ మార్కెట్ కాంప్లెక్స్, చెన్నై బీచ్-పొన్నేరి-చెన్నై బీచ్ మధ్య 14 ప్రత్యేక సబర్బన్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు.

### గ్రామీణ ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లకు రూ.505 కోట్లు

పెరంబూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వంద హై-లెవల్ వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.505 కోట్లు కేటాయించింది. ఇటీవల ముగిసిన శాసనసభ సమావేశాల్లో పలువురు ఎమ్మెల్యేలు, తమ నియోజకవర్గాల్లో నదులు, చెరువులపై ఉన్న రోడ్లు వరదల సమయంలో మునిగిపోతుండడంతో రవాణా స్తంభించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే, పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేలా హై-లెవల్ వంతెనలు ఏర్పాటుచేయాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిని పరిశీలించిన ముఖ్యమంత్రి స్టాలిన్, తొలివిడతగా గ్రామీణ ప్రాంతాల్లో 100 హై-లెవల్ వంతెనల ఏర్పాటుకు రూ.505 కోట్లు కేటాయించినట్లు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

### కోడంబాక్కం ట్రాఫిక్ ఎస్ఐ బదిలీ

పెరంబూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడంబాక్కం ట్రాఫిక్ ఎస్ఐ సాయుధ దళ విభాగానికి బదిలీ చేశారు. కొద్దిరోజుల క్రితం హెల్మెట్ లేకుండా వచ్చిన ముగ్గురు యువకులను కోడంబాక్కం ట్రాఫిక్ ఎస్ఐ కలైవాణి అడ్డుకున్నారు. ఆ సమయంలో ఆ యువకులు, ఎస్ఐ మధ్య వాగ్వివాదం జరిగింది. ఆ యువకులు మద్యం మత్తులో తనతో అనాగరికంగా వ్యవహరించినట్లు ఎస్ఐ కలైవాణి తప్పుడు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో విచారించిన ఉన్నతాధికారులు, ఎస్ఐ కలైవాణి చర్యలను ఖండించారు. ఈ నేపథ్యంలో, ఎస్ఐ కలైవాణి, ఆమెపై ఫిర్యాదు చేసినా స్పందించని ట్రాఫిక్ కమిషనర్ అయ్యప్పన్‌ను సాయుధ దళానికి బదిలీ చేశారు.

---

కీళడి పరిశోధనలపై కేంద్రానికి

# సవతితల్లి ప్రేమ తగదు

● మాజీ ఐఏఎస్ అధికారి సహాయం

టి.నగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కీళడి పురావస్తు తవ్వకాల ఫలితాలను అంగీకరించకుండా తమిళుల ప్రాచీన నాగరికతను వెలుగులోకి రాకుండా అడ్డుకుంటూ కేంద్ర ప్రభుత్వం తమిళులపై సవతితల్లి ప్రేమను ప్రదర్శిస్తోందని మాజీ ఐఏఎస్ అధికారి సహాయం ఆరోపించారు. సహాయం రచించిన 'కడైసీ తరియిల్ కండాంగి సేలై' అనే పుస్తకావిష్కరణ సభ నామక్కల్ సమీపం లత్తువాడిలో జరిగింది. ఈ సభానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల శివగంగ జిల్లా తిరుభువనంలో జరిగిన లాకప్ డెత్ ఎట్టి పరిస్థితుల్లో ఆమోదయోగ్యం కాదని, పోలీసులకు కల్పించిన అధికారాలు ప్రజలను కాపాడేందుకేనని వారు గ్రహించాలన్నారు. ఈ విషయంలో హోంమంత్రిత్వశాఖ కూడా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ మరింత శ్రద్ధ చూపాలని, పోలీసు శాఖ దుందుడుకు చర్యలకు కళ్లె వేయాలని లేకుంటే ప్రభుత్వానికి చెడ్డపేరు తప్పదన్నారు. ప్రపంచ ప్రాచీన భాషల్లో తమిళం ఒకటని, అలాంటి భాషను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, ఉత్తరాది భాషలకు కేటాయించే నిధులు ఎక్కువగా ఉన్నప్పుడు, అందులో సగం కూడా తమిళభాషకు కేటాయించకపోవడం గర్హనీయమన్నారు. తమిళుల నాగరికత, చరిత్ర ప్రాచీనమైనదని, కీళడి పురావస్తు తవ్వకాలలో బయల్పడుతున్న అదురైన నిక్షేపాలన్నీ రుజువుచేస్తున్నాయన్నారు. కీళడి పరిశోధన ఫలితాలను బట్టి తమిళుల ప్రాచీన నాగరికతను ప్రపంచానికి ఎలుగెత్తి చాటాల్సిన బాధ్యతల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో సవతి తల్లి ప్రేమను ప్రదర్శించకుండా తమిళుల ప్రాచీన నాగరికతకు సంబంధించి కీళడి తవ్వకాల పరిశోధనల నివేదికలను జాప్యం వహించకుండా ఆమోదించాలని సహాయం డిమాండ్ చేశారు.



పుస్తకావిష్కరణ సభలో ప్రసంగిస్తున్న మాజీ ఐఏఎస్ అధికారి సహాయం

### మంత్రి కేఎన్ నెహ్రూ సోదరుడి కేసు రద్దు

పెరంబూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఐఓబీకి రూ.15 లక్షల జరిమానా చెల్లించాలనే నిబంధనతో మంత్రి నెహ్రూ సోదరుడు రవిచంద్రన్‌పై నమోదైన కేసు రద్దు చేస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. 2013లో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ నుంచి తీసుకున్న రూ.30 కోట్ల రుణాన్ని సోదర కంపెనీలకు మళ్లించడంతో, రూ.22.48 కోట్ల నష్టం ఏర్పడిందని మంత్రి నెహ్రూ సోదరుడు రవిచంద్రన్ డైరెక్టర్‌గా ఉన్న సంస్థపై ఆరోపణలు తలెత్తాయి. ఆ ప్రకారం, రవిచంద్రన్ సహా పలువురిపై 2021లో సీబీఐ కేసు నమోదుచేసింది. ఈ కేసు ఆధారంగా మంత్రి కేఎన్ నెహ్రూ, కుటుంబసభ్యుల, బంధువుల ఇళ్లలో ఈడీ తనిఖీలు చేసింది. ఈ నేపథ్యంలో, ఎగ్మూర్ కోర్టులో విచారణలో ఉన్న ఈ కేసు రద్దు చేయాలని కోరుతూ రవిచంద్రన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు విచారణకు రాగా ఈడీ తరఫున, సీబీఐ కేసు ఆధారంగా ఈడీ కేసు నమోదుచేసిందని, సీబీఐ కేసు రద్దు చేయాలనే కేసులో తమను కూడా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈడీ విజ్ఞప్తిని రవిచంద్రన్ తరఫున అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో న్యాయమూర్తి భరత్ చక్రవర్తి... ఈ కేసులో ఎలాంటి మోసం జరగలేదు. ఈ మోసంలో ప్రభుత్వ అధికారులకు ప్రమేయం లేదు. మంత్రి సోదరుడు రవిచంద్రన్‌కు రూ.30 లక్షల జరిమానా విధిస్తున్నట్లు, అందులో రూ.15 లక్షలు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌కు, రూ.15 లక్షలు తమిళనాడు రాజీ, పరిష్కార కేంద్రానికి చెల్లించాలంటూ నిబంధన విధిస్తూ కేసు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

### నత్తం విశ్వనాథన్ కేసు కొట్టివేయాలనే పిటిషన్ తోసివేత

పెరంబూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తనకు వ్యతిరేకంగా దాఖలైన ఎన్నికల కేసు రద్దు చేయాలనే నత్తం విశ్వనాధన్ పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో దిండుగల్ జిల్లా నత్తం నియోజకవర్గం నుంచి అన్నాడీఎంకే అభ్యర్థిగా పోటీచేసిన నత్తం విశ్వనాధన్, డీఎంకే అభ్యర్థి ఆండి అంబలంపై 11,932 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. విశ్వనాథన్ ఎన్నికను వ్యతిరేకిస్తూ డీఎంకే అభ్యర్థి ఆండి అంబలం మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌లో... అన్నాడీఎంకే ఎమ్మెల్యే నత్తం విశ్వనాథన్ తన నామినేషన్‌లో పలు వివరాలు నమోదుచేయలేదని, ఓటర్లకు నగదు బట్వాడా చేశారని, పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం చేయరాదనే ఎన్నికల నిబంధన అతిక్రమించారని, ఎన్నికల సంఘం నిర్ణయించిన పరిమితి కన్నా అధికంగా ఎన్నికల్లో ఖర్చు చేశారని పిటిషన్‌లో తెలిపారు. ఈ కేసు న్యాయమూర్తి పీటీ ఆషా విచారిస్తున్నారు. ఈ క్రమంలో, తనపై ఎన్నికల కేసు దర్యాప్తు కొనసాగించేందుకు ఎలాంటి కారణాలు లేవని, డీఎంకే అభ్యర్థి ఆండి అంబలం దాఖలుచేసిన పిటిషన్ నిరాకరించాలంటూ నత్తం విశ్వనాధన్ తరఫున పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి ఆషా, ఎన్నికల కేసు విచారణకు తగిన కారణాలున్నాయంటూ నత్తం విశ్వనాథన్ దాఖలుచేసిన పిటిషన్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేశారు.

### బైక్ నుంచి జారిపడిన ఎస్ఐ మృతి

వాషర్‌మెన్‌పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బైక్ జారిపడి గాయపడిన ఎస్ఐ చికిత్స ఫలించక మృతిచెందాడు. తిరువణ్ణామలై జిల్లా కడలాడి గ్రామానికి చెందిన కుబేంద్రన్ (55) కళంబూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నాడు. కొద్ది వారాల క్రితం విధుల నుంచి ద్విచక్రవాహనంపై కుబేంద్రన్ ఇంటికి బయల్దేరారు. బక్కార్‌పేట సమీపంలో వస్తూ బైక్ నుంచి జారిపడిన కుబేంద్రన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు అతడిని వెంటనే తిరువణ్ణామలై ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం గిండిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక సోమవారం ఉదయం కుబేంద్రన్ మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### లా వర్సిటీకి నలుగురు సిండికేట్ సభ్యులు

పెరంబూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ న్యాయ విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నలుగురు సిండికేట్ సభ్యులను నియమించింది. ఆ ప్రకారం, న్యాయవాదులు మణివన్నన్, అరుణై అరుళ్‌కుమార్, మదియళగన్, లక్ష్మీ నారాయణన్‌లు నూతన సిండికేట్ సభ్యులుగా ఎంపికయ్యారు.

'మహిళా ప్రోత్సాహక నిధి'

### దరఖాస్తు స్వీకరణ ప్రారంభం

జవాషర్‌మెన్‌పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది స్వచ్ఛంద కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి 'మహిళా ప్రోత్సాహక నిధి'కి సంబంధించిన దరఖాస్తుల చేసే ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. గత శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.. ప్రజల సమస్యలు వారి వద్దకే వెళ్లి తెలుసుకునేలా కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకారం, రాష్ట్ర వ్యాప్తంగా నగర, గ్రామీణ ప్రాంతాల్లో 'ఉంగళుడన్ స్టాలిన్' కార్యక్రమం ప్రారంభించనున్నారు. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 10వేల ప్రత్యేక శిబిరాలను ఈనెల 15వ తేది కడలూరు జిల్లా చిదంబరం మున్సిపాలిటీలో ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 15న ప్రారంభమై నవంబరు వరకు అన్ని జిల్లాల్లో నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. నగర ప్రాంతాల్లో 13 ప్రభుత్వ శాఖలకు చెందిన 43 సేవలు, గ్రామీణ ప్రాంతాల్లో 15 శాఖలకు చెందిన 46 సేవలు అందజేయనున్నారు. శిబిరాలు నిర్వహించే ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాలు నిర్వహించే ప్రాంతం, సమయం తదితరాలను స్వచ్ఛంద కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి తెలియజేయనున్నారు. అలాగే, 'కలైంజర్ మహిళా ప్రోత్సాహక నిధి'లో మహిళలకు ప్రతినెలా రూ.1,000 అందించే పథకంలో కొత్త లబ్దిదారులను ఎంపిక చేయనున్నారు. అందుకోసం ఇళ్లకు వెళ్లే కార్యకర్తలు ప్రజలకు దరఖాస్తు పత్రాలు అందించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

### ఆన్‌లైన్ రమ్మీకి మరో యువకుడి బలి

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీ ఆడి నగదు పోగొట్టుకున్న యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరునల్వేలి జిల్లా మేలపాలమదై ప్రాంతానికి చెందిన ఆర్ముగగని (33) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కొంత కాలంగా ఆన్‌లైన్ రమ్మీకి బానిసైన ఆర్ముగగని, ఇంటి పేరుతో, స్వయం సహాయక బృందాల నుంచి రుణం పొంది ఆన్‌లైన్ రమ్మీలో పెట్టాడు. లక్షలాది రూపాయలు కోల్పోయిన ఆర్ముగగని, అప్పుల బాధ తట్టుకోలేక ఆదివారం విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు అతడిని వెంటనే పాళయంకోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక మృతిచెందాడు. ఈ ఘటనపై సివలప్పేరి పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

### పళనిస్వామికి బీజేపీ నేతల అభినందన

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఎన్నికల ప్రచారానికి బీజేపీ నేతలు అభినందనలు తెలిపారు. మేట్టుపాళయం వద్ద పళనిస్వామిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురగన్ కలిసి అభినందనలు తెలిపారు.

## ఇంజనీరింగ్ కోర్సులకు కౌన్సెలింగ్ ప్రారంభం

పెరంబూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లోని సీట్ల భర్తీకి సంబంధించిన ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. అన్నా విశ్వవిద్యాలయం పరిధిలోని 445 ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో బీఈ, బీటెక్ కోర్సుల్లో సుమారు 2 లక్షల సీట్లు కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేయనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ఇంజనీరింగ్ కోర్సుల దరఖాస్తు స్వీకరణ మే 6న ప్రారంభమై జూన్ 6వ తేదీతో ముగిసింది. అనంతరం జూన్ 11న ర్యాండమ్ జాబితా విడుదల చేసి, సర్టిఫికెట్లు పరిశీలించి, బీఈ, బీటెక్ కోర్సుల్లో చేరేందుకు 2,41,641 మంది అర్హులుగా ప్రకటించారు. వారిలో 2,39,299 మంది జనరల్ విభాగంలో, 2,342 మంది వృత్తి విద్య విభాగంలో అర్హత సాధించారు. అలాగే, 8,657 దరఖాస్తులు నిరాకరించారు. గత నెల 27న ర్యాంలకుల జాబితా విడుదల చేశారు. ఈ ఏడాది 144 మంది విద్యార్థులు 200లకు 200 కటాఫ్ మార్కులు సాధించారు. వారిలో 139 మంది రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో చదివిన వారున్నారు.

● ఆన్‌లైన్ కౌన్సెలింగ్: ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్ కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమై ఆగస్టు 26వ తేది వరకు ఆన్‌లైన్‌లో జరుగనుంది. సోమవారం కౌన్సెలింగ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు, దివ్యాంగులు, క్రీడా కోటా, మాజీ సైనికుల వారసులు ప్రత్యేక కౌన్సెలింగ్‌లో పాల్గొననున్నారు. ఈ కౌన్సిలింగ్ ఈ నెల 11వ తేది వరకు జరుగనుంది. అనంతరం జనరల్ విభాగం కౌన్సెలింగ్ ఈ నెల 14 నుంచి ఆగస్టు 19వ తేది వరకు నిర్వహించనున్నారు. 200 నుంచి 179 కటాఫ్ మార్కులు పొందిన 39,145 మంది విద్యార్థులకు ఈ నెల 19వ తేది వరకు మొదటి విడత కౌన్సెలింగ్ జరుగనుంది. రెండో విడత ఈ నెల 28 నుంచి, మూడో విడత ఆగస్టు 7 నుంచి ప్రారంభం కానుంది. గత ఏడాది కన్నా ఈ ఏడాది 41,773 మంది అదనంగా దరఖాస్తులు సమర్పించారు. ఈ కౌన్సెలింగ్ పూర్తిగా ఆన్‌లైన్‌లో www.tneaonline.org అనే వెబ్‌సైట్ ద్వారా నిర్వహించనున్నారు. విద్యార్థులు కళాశాలలు ఎంపిక చేసుకునే మంది వాటి వివరాలు, మౌళిక వసతులు, విద్యా బోధన తదితరాలు పరిగణలోకి తీసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను మూయడం లేదు

● మంత్రి గీతా జీవన్



వాషర్‌మెన్‌పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 501 అంగన్వాడీ కేంద్రాలు మూసివేస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతా జీవన్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో తగినంత మంది ఉద్యోగులు లేకపోవడంతో, తల్లిదండ్రులు తమ పిల్లలను పంపేందుకు ఆసక్తి చూపడం లేదని, ఈ కారణంగా ఈ ఏడాది 501 అంగన్వాడీ కేంద్రాలు మూతపడనున్నాయని ఇటీవల ఓ తమిళ పత్రికలో వార్తలు ప్రచురించారని తెలిపారు. ప్రభుత్వాన్ని కించపరిచేలా ప్రచురించిన అసత్య వార్తల ఆధారంగా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, నయినార్ నాగేంద్రన్, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం 500 అంగన్వాడీ కేంద్రాలు మూసివేయడాన్ని ఖండిస్తూ ప్రకటనలు విడుదల చేశారని, వాస్తవాలు తెలుసుకోకుండా చేసిన ఇలాంటి ప్రకటనలను తాము ఖండిస్తున్నామన్నారు. 2021లో తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన సమయంలో, రాష్ట్రంలో 54,439 అంగన్వాడీ కేంద్రాలు మాత్రమే ఉన్నాయని, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్టాలిన్, తన నాలుగేళ్ల పాలనలో మరో 44 అంగన్వాడీ కేంద్రాలు ప్రారంభించారని తెలిపారు. అన్ని కేంద్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయని, ఈ కేంద్రాలు తగ్గించడం, మూసివేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని, అవసరమైతే, అదనపు అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడతామని మంత్రి గీతా జీవన్ స్పష్టం చేశారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తాంబరం: చిట్లపాక్కం ఏరియా, తిరువిక నగర్, హరిదాస్ పురం మెయిన్ రోడ్డు, అమ్మన్ ఆలయ వీధి, అగత్తియర్ వీధి, సర్వమంగళ నగర్, యూవీ స్వామినాధన్ వీధి, పామన్ స్వామి రోడ్డు, బాబు వీధి, సుధ అవెన్యూ, కలైవానర్ వీధి, కల్యాణసుందరం వీధి, శారదాంబాళ్ వీధి, జవహర్ వీధి, రామకృష్ణ నగర్, రామకృష్ణాపురం, వైద్యలింగం రోడ్డు, శర్మ నగర్, మాళవిక అవెన్యూ, నజీబ్ అవెన్యూ, తిరుమలై నగర్, భాగ్యం నగర్, సెంబాక్కం మనవాళన్ నగర్, సెంథిల్ అవెన్యూ, లక్ష్మి నగర్, నవనీతం నగర్, వీజీపీ పొన్ నగర్, కామరాజ్ నగర్ 8వ వీధి, జయేంద్ర నగర్ 1 నుంచి 13 వీధులు

అడయార్: శాస్త్రి నగర్ 1వ సీవార్డ్ రోడ్డు, 3వ సీవార్డ్ రోడ్డు, బాలకృష్ణ రోడ్డు, జయరామ్ నగర్, కుప్పం బీచ్ రోడ్డు, రాజా శ్రీనివాసన్ నగర్ మెయిన్ రోడ్డు, రాజగోపాలన్ మెయిన్ రోడ్డు, టీచర్స్ కాలని 1 నుంచి 4 వీధులు, వేంబులిఅమ్మన్ ఆలయ వీధి, సీజీఈ కాలని, జయరామ్ వీధి

సేలయూర్: రమణ నగర్, మాడంబాక్కం మెయిన్ రోడ్డు, మాణిక్యం అవెన్యూ, ఏఎల్ఎస్ నగర్ కొంత భాగం, పద్మావతి నగర్ కొంత భాగం, అగరం మెయిన్ రోడ్డు కొంత భాగం, వేదాచలం నగర్, ఎస్సార్ కాలని

వీటీ రాజన్ రోడ్డు కేకే నగర్, అశోక్ నగర్, వడపళని, పీటీ రాజన్ రోడ్డు, రాణి అన్నానగర్, ఎస్ఎస్‌టీ నగర్, వెంకటేశపురం 14,15 సెక్టార్లు, అళగర్ పెరుమాళ్ ఆలయ వీధి, మస్తాన్‌అలి గార్డన్, ఎల్లైముత్తమ్మన్ ఆలయ వీధి, అరుణ కాలని, బేబి కాలని, విజయ వీధి, అశోక్ నగర్ 77 నుంచి 92 వీధులు, కామరాజర్ రోడ్డు, 1 నుంచి 4,6,18,19 అవెన్యూ, సర్వమంగళం కాలని, అనుగ్రహ కాలని, సౌందరపాండియన్ రోడ్డు, కన్నప్పార్ రోడ్డు, డా.నటేశన్ రోడ్డు, పుదూర్ 1 నుంచి 9,11 నుంచి 14, 34 నుంచి 44 వీధులు, ఒట్టగపాళయం 1 నుంచి 13 వీధులు, వెస్ట్ శివన్ ఆలయ వీధి, సౌత్ శివన్ ఆలయ వీధి, 100 అడుగుల రోడ్డు, అర్కాట్ రోడ్డు, పిళ్లయార్ ఆలయ వీధి, దేశిగర్ వీధి, సైదాపేట రోడ్డు, గోపాల్ వీధి, సన్నధి వీధి, కరునీగర్ వీధి, శివలింగాపురం, బొబ్బిలి రాజా రోడ్డు, ఏపీ పాత్రో రోడ్డు, కలింగ కాలని, పన్నీర్‌సెల్వం రోడ్డు, బాలసుబ్రమణ్యం రోడ్డు, 240 ఎల్‌ఐజీ కాలని, 6 నుంచి 9 అవెన్యూ, మూర్తి వీధి, రుక్మిణి వీధి, షోలింగనల్లూర్: మేడవాక్కం పుష్పా నగర్, పెరుమాళ్ ఆలయ ఆర్చ్, పిళ్లయార్ ఆలయ వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి, భజన ఆలయ వీధి, పెరుమాళ్ ఆలయ వీధి, కుల్లకరై వీధి, దావూద్ నగర్ 1 నుంచి 3 వీధులు, లక్ష్మి అప్పాదురై వీధి, శాయి అనూష ఫ్లాట్, రాగ అమృత ఫ్లాట్స్, సోము నగర్, మురుగ ఆలయ ఆర్చ్, మందవెల్లి వీధి, కట్టబొమ్మన్ వీధి, పుష్పా నగర్ పార్క్, దేవి కరువిళి నగర్, శబరి నగర్, అయ్యప్ప నగర్, రామచిత్ర ఫ్లాట్స్, సూర్య నగర్, జయ నగర్, చైతన్య స్కూల్, పోస్టాఫీసు, సత్యసాయి నగర్, పెరుంబాక్కం గ్లోబల్ హాస్పిటల్, ఎన్‌పీఎస్ స్కూల్, ఇందిరా ప్రియదర్శిని నగర్, గురుదేవ్ కాలని, ఎంబసి రెసిడెన్సీ, దోశి అపార్ట్‌మెంట్, వల్లి నగర్, వెంగైవాసల్ మెయిన్ రోడ్డు, దళపతి స్టాలిన్ వీధి, పునితవతి కాలని 1 నుంచి 6 వీధులు, తిరువళ్లువర్ వీధి, వేంబులిఅమ్మన్ ఆలయ వీధి, విడుదలై నగర్, అన్నానగర్, చక్రవర్తి నగర్, మ్యాక్స్‌వర్త్ నగర్, మనోహన్ నగర్, లియో ఇండస్ట్రియల్ ఎస్టేట్

అరుంబాక్కం: 100 అడుగుల రోడ్డు, జాయ నగర్ 17,18,21,23 వీధులు మరియు జాయ్ నగర్ మెయిన్ రోడ్డు, వళ్లువర్ రోడ్డు, అమరావతి నగర్, ఎస్వీపీ నగర్, జగన్నాధన్ నగర్ 2వ మెయిన్ రోడ్డు, పెరుమాళ్ ఆలయ గార్డన్, రామకృష్ణ వీధి

పోరూర్: కారంబాక్కం మహాలక్ష్మి నగర్, బుద్ధర్ కాలని, కమల నగర్, ఆర్కాట్ రోడ్డు, రాజేశ్వరి నగర్, తిరుమురుగన్ నగర్, దేవి నగర్, అయ్యప్పన్‌తాంగళ్ మౌంట్ పూందమల్లి రోడ్డు, కేకే నగర్, చంద్ర నగర్, సన్ గార్డన్, స్వామినాధన్ నగర్, జాస్మిన్ కోర్టు, స్టెర్లింగ్ సాధన షెల్టర్స్, కన్నికాపురం, ఏడీ గోవిందరాజ్ నగర్, ఆడ్కో నగర్, డీఆర్ఆర్ నగర్

ట్రిప్లికేన్: అలంగాతా వీధి, అరిముత్త వీధి, అర్ముగచెట్టి వీధి, బీవీ నాయకన్ వీధి, బిగ్ స్ట్రీట్, చెంగల్వరాయన్ వీధి, కార్ స్ట్రీట్, కెనాల్ వీధి, ఈశ్వరదాస్ లాలా వీధి, ఫైర్‌వుడ్ బ్యాంక్ షెల్ వీధి, గణపతి వీధి, మెరైన్ కామరాజర్ రోడ్డు, కర్పగ కన్నియమ్మన్ ఆలయ 1 నుంచి 5 వీధులు, నల్లతండి వీధి, నాగోజి వీధి, ఆర్‌హెచ్ లాలా వీధి, న్యూ ట్యాంక్ స్క్వేయర్ వీధి, సింగపెరుమాళ్ ఆలయ వీధి, సుంకువర్ వీధి, ట్రిప్లికేన్ హైరోడ్డు, తొప్పు వెంకటాచలం వీధి, తనికాచలం వీధి, శివరామన్ వీధి, వీఆర్ పిళ్లై వీధి

ఐస్ హౌస్: నడుకుప్పం 1 నుంచి 6 వీధులు, డా.నటేశన్ రోడ్డు, కొత్త వీధి, రామ్ నగర్ 1 నుంచి 8 వీధులు, కందప్ప వీధి, ముత్తప్ప వీధి, ఎరుసప్ప వీధి, ఎలిఫెంట్ ట్యాంక్ 1 నుంచి 6 వీధులు, గజపతి లాలా 1 నుంచి 3 వీధులు, హనుమంతపురం, సురేష్ మక్కన్ వీధి, తొండైఖాన్ మక్కన్ వీధి, ఈ డిపోట్ వీధి, కుదరత్ అలి మక్కన్ వీధి

మైలాపూర్: మైలాపూర్, ఆర్కే నగర్‌లోని కొన్ని ప్రాంతాలు

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అదనంగా సీట్లు

● ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్



పెరంబూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాలల్లో చేరేందుకు అధిక సంఖ్యలో దరఖాస్తుల రావడంతో, ప్రస్తుత విద్యా సంవత్సరం సీట్ల సంఖ్య 20 శాతం పెంచినట్లు ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ సోమవారం ప్రకటించారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 180 ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాలలున్నాయి. ఈ కళాశాలల్లో 2025-26వ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు దరఖాస్తు స్వీకరణ మే 7న ప్రారంభమై 27వ తేదీతో ముగిసింది. కళాశాలల్లో చేరేందుకు సుమారు 2 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం తొలివిడతగా ప్రత్యేక విభాగం, అనంతరం జనరల్ విభాగం కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే, మొదటి సంవత్సరం తరగతులు గత నెల 30వ తేది నుంచి ప్రారంభమయ్యాయి.

ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు, 2025-26వ విద్యా సంవత్సరంలో ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో 20 శాతం అదనపు సీట్లు కల్పిస్తున్నట్లు మంత్రి కోవి చెళియన్ ప్రకటించారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉన్నత విద్య, వైద్యం తన రెండు కళ్లని చెప్పారని, మన యువత ప్రపంచంలో ఉన్నత స్థాయిలో ఉండేలా చూసుకోవాలనే తన లక్ష్యంతో, ఉన్నత విద్య అందరికి చేరాలన్న ఉద్దేశంతో 'పుదుమై పెన్', 'తమిళ్ పుదల్వన్' వంటి గొప్ప పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఉన్నత విద్యలో చేరే విద్యార్థుల సంఖ్య అధికం కావడంతో, రాష్ట్రంలో కొత్తగా 15 ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు ప్రారంభించినట్టు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్ దృష్ట్యా ప్రభుత్వ ఆర్ట్స్‌సైన్స్ కళాశాలల్లో 20 శాతం, ఎయిడెడ్ కళాశాలల్లో 15 శాతం, స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో 10 శాతం అదనపు సీట్లు భర్తీచేసుకునేందుకు అనుమతిచ్చినట్లు మంత్రి తెలిపారు.

### వక్ఫ్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

● కేంద్ర ప్రభుత్వానికి ఎంఎన్‌ఎంకే డిమాండ్

వాషర్‌మెన్‌పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి సహా 9 తీర్మానాలను మదురైలో జరిగిన మనిదనేయ మక్కల్ (ఎంఎన్ఎం) కట్చి తీర్మానం చేసింది. ఎంఎన్ఎం మహానాడు ఆదివారం మదురై మహ్మద్ గౌస్ మైదానంలో జరిగింది. మధ్యాహ్నం 3 గంటలకు మదురై పాండి ఆలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జవాహిరుల్లా మాట్లాడుతూ... ముస్లింలకు రాజకీయాల్లో ప్రాధాన్యత తగ్గడం బాధాకరమన్నారు. జనాభా ప్రాతిపదికన పార్లమెంటులో 80 మంది ప్రతినిధులకు బదులు 24 మంది ముస్లింలు మాత్రమే ఉన్నారన్నారు. మహాసభలో భాగంగా వక్ఫ్ సవరణ చట్టం సత్వరం వాపసు తీసుకోవాలి, ఎన్నికల్లో ఈవీఎంలు ఉపసంహరించుకోవాలి, విద్య కాషాయీకరణ చేయాలనే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను అడ్డుకుంటున్న డీఎంకే ప్రభుత్వానికి కృతజ్ఞతలు సహా 9 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

### ధోనీకి సీఎం జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎమ్మెస్ ధోని పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. పుటిన రోజు జరుపుకుంటున్న ధోనీకి శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం స్టాలిన్ తన ఎక్స్ పేజీలో.. "అత్యంత ఒత్తిడితో కూడిన పరిస్థితులను కూడా అలవోకగా తన బాణితో మార్చిన అరుదైన, ప్రత్యేకమైన క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీకి పుట్టినరోజు శుభాకాంక్షలు! గొప్పతనం అనేది పుట్టుకతోనే వచ్చేది కాదని, మీరు తీసుకునే ప్రతి నిర్ణయంతో, మీరు చేసే ప్రతి పరుగుతో, మీరు నిశ్శబ్ధంగా సాధించే ప్రతి విజయంతో కూడుకున్నదని మీరు చూపించారు" అంటూ సీఎం జన్మదిన శుభాకాంక్షల్లో పేర్కొన్నారు.

### తాగునీరు సరఫరా చేసే రిజర్వాయర్లలో 56 శాతం జలాలు

చెన్నై, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై వాసులకు మంచినీరందించే ఐదు జలాశయాల్లో ప్రస్తుతం 56 శాతం వరకు జలాలున్నాయని అధికారులు తెలిపారు. నగరవాసులకు పూండి, పుళల్, చెంబరంబాక్కం, చోళవరం, కన్నన్‌కోట తేర్వాయ్‌కండిగ జలాశయాల నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ ఐదు జలాశయాల్లోనూ ప్రస్తుతం 11,757 మిలియన్ల ఘనపుటడుగులు మేర జలాలున్నాయని అధికారులు తెలిపారు. ఆదివారం సాయంతం ఈ ఐదు జలాశయాల్లో నీటిమట్టం 56.83 శాతం వరకు ఉందని అధికారులు తెలిపారు. నగరానికి నెలకు ఒక టీఎంసీ నీరు అవసరమని, ప్రస్తుతం 6 టీఎంసీలవరకు ఈ జలాశయాల్లో నీటి నిల్వలున్నాయని తెలిపారు.

● వాచ్‌మన్ మృతి కేసు

### సీబీఐ విచారణకు బదిలీ

● గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తిరుభువనం అజిత్‌కుమార్ మృతి కేసు సీబీఐ విచారణకు బదిలీ చేస్తూ ప్రభుత్వ గెజిట్‌లో ప్రకటించారు. శివగంగ జిల్లా మడప్పురం గ్రామానికి చెందిన అజిత్ కుమార్ (27) మడపుప్పం భద్రకాళియమ్మన్ ఆలయంలో మూడు నెలలుగా వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 27వ తేది ఆలయానికి వచ్చిన నికిత అనే మహిళ కారులోని 10 సవర్ల నగలు మాయమయ్యాయనే ఫిర్యాదుతో, పోలీసులు అజిత్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. మరుసటి రోజైన 28వ తేది అజిత్ కుమార్ సోదరుడు నవీన్, కారు నడిపిన ఆటో డ్రైవర్ అరుణ్‌ను తిరుభువనం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. నగలు చోరీకి గురైన విషయం తమకు తెలియదని వారు తెలపడంతో వారిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో, అజిత్‌కుమార్‌ను ఆలయం వెనుక ఉన్న గోశాల ప్రాంతంలో పోలీసులు విచారించారు. విచారణలో పోలీసులు అజిత్‌కుమార్ తీవ్రంగా కొట్టడంతో అతను స్పృహతప్పి పడిపోయాడు. దీంతో, అతడిని శివగంగ, మదురై ప్రభుత్వాసుపత్రులకు చికిత్స కోసం తరలించగా, మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, పోలీసుల దాడితోనే అజిత్‌కుమార్ మృతిచెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. అజిత్‌కుమార్‌పై దాడిచేసిన ఐదుగురు పోలీసులను అరెస్ట్‌చేశారు. ఈ వ్యవహారంపై హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులతో న్యాయ విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో, తిరుభువనం యువకుడి మృతి కేసు విచారణ సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఈ ఉత్తర్వులను ప్రభుత్వ గెజిట్‌లో ప్రకటించారు. త్వరలోనే సీబీఐ అధికారులు వాచ్‌మన్ మరణంపై విచారణ చేపడతారని అధికారులు తెలిపారు.

### టీవీకే ధర్నాకు అనుమతి

తిరుభువనం ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్ హత్య కేసుకు సంబంధించి టీవీకే ధర్నాకు పోలీసులు అనుమతించినట్లు సమాచారం. శివగంగ జిల్లా తిరుభువనం సమీపంలోని మడప్పురం ఆలయ వాచ్‌మన్ అజిత్ కుమార్ పోలీసుల లాకప్‌లో మృతిచెందాడు. హైకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి ఈ కేసులో విచారణ జరపాలి డిమాండ్‌తో తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆధ్వర్యంలో ఎగ్మోర్‌లోని రాజారత్నం స్టేడియం వద్ద ఈ నెల 3వ తేది ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు. పోలీసులు ధర్నాకు అనుమతించకపోవడంతో, ఈ నెల 6వ తేది మద్రాసు హైకోర్టులో టీవీకే తరఫున పిటిషన్ దాఖలైంది. హైకోర్టు ఉత్తర్వులతో టీవీకే ధర్నాకు పోలీసులు అనుమతించినట్లు తెలిసింది.

### 25న ప్రమాణ స్వీకారం చేయనున్న రాజ్యసభ ఎంపీలు

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి రాజ్యసభ ఎంపీలుగా ఏకగ్రీవంగా ఎంపికైన ఆరుగురు ఈ నెల 25వ తేది ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పి.విల్సన్, ఎస్మార్ శివలింగం, రచయిత సల్మా, కమల్ హాసన్ తదితరులు 25న పదవీ ప్రమాణం చేయనున్నారు. అదే రోజున అన్నాడీఎంకేకు చెందిన ఇన్బదురై, ఎం.ధనపాల్ పదవీ ప్రమాణం చేయనున్నారు.

## 'ఎఫ్-1' రేసింగ్ చిత్రాల్లో నటించాలని ఉంది : అజిత్



తనకు 'ఎఫ్-1' కార్ రేసింగ్ నేపథ్యంలో సాగే చిత్రాల్లో నటించాలని ఉందని, అలాంటి అవకాశం వస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోనని అగ్ర హీరో అజిత్ కుమార్ స్పష్టంచేశారు. స్వతహాగా కార్ రేసర్ అయిన.. ఇటీవల అజిత్ కుమార్ రేసింగ్ అనే జట్టు ఏర్పాటు చేసి, వివిధ అంతర్జాతీయ కార్ రేసింగ్ పోటీల్లో పాల్గొంటున్న విషయం తెల్సిందే. బెల్జియం, దుబాయ్, ఇటలీ వంటి దేశాల్లో జరిగిన కార్ రేసింగ్ పోటీల్లో ఆయన జట్టు పాల్గొని విజయం సాధించింది. ప్రస్తుతం '24 హెచ్' అనే రేసింగ్ పోటీల్లో అజిత్ టీం పాల్గొంటుంది. ఈ సందర్భంగా అజిత్ కుమార్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. 'ఎఫ్-1' చిత్రంలో బ్రాడ్ బిట్ నటించినట్టుగా కార్ రేస్ నేపథ్యంలో తెరకెక్కే చిత్రాల్లో మిమ్మల్ని చూడొచ్చా అనే ప్రశ్న ఎదురైంది. దీనికి ఆయన సమాధానమిస్తూ, 'ఎందుకు వీలుపడదు. నా చిత్రాల్లో స్టంట్ సన్నివేశాల్లో నేనే నటిస్తున్నాను. అలాంటి అవకాశం వస్తే ఎందుకు వదులుకుంటాను. 'ఎఫ్-1' వంటి చిత్రాల్లో నటించే ఛాన్స్ వస్తే ఖచ్చితంగా నటిస్తాను' అని పేర్కొన్నారు. కాగా, 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలోనే అజిత్ నటించనున్న విషయం తెల్సిందే.

## 1న 'హౌస్‌మేట్స్' రిలీజ్




ఫోటో 2సిని7: 'హౌస్‌మేట్స్'లో ఓ దృశ్యం

దర్శన్, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన 'హౌస్‌మేట్స్' చిత్రం ఆగస్టు 1వ తేదీ విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. 'గనా', 'తుంబా' వంటి సినిమాల తర్వాత దర్శన్ హీరోగా ఈ సినిమాలో నటించారు. ఫాంటసీ హర్రర్, కామెడీ జోనర్‌లో రూపొందించారు. ఈ సినిమా రైట్స్‌ను ఇప్పటికే శివకార్తికేయన్ ప్రొడక్షన్ సంస్థ దక్కించుకుంది. ఇందులో కాళి వెంకట్, అర్ష చాందిని బైజు, వినోదిని, దీనా, అబ్దుల్ లీ, మాస్టర్ హెన్రిక్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. డెబ్యూ డైరెక్టర్ రాజవేల్ దర్శకత్వం వహించారు. ఒక అపార్టుమెంట్ చుట్టూ తిరిగే సంఘటనల సమాహారంతో పాటు ఒక మధ్యతరగతి కుటుంబం దైనందిన జీవితం, ఎదుర్కొనే కష్టనష్టాలు ప్రతిబింబించేలా మూవీని రూపొందించారు.

చిత్రజ్యోతి

## కోలీవుడ్‌కు పరిచయంకానున్న రైనా



సురేష్ రైనా

భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా తమిళ వెండితెరకు పరిచయంకానున్నారు. డెబ్యూ డైరెక్టర్ లోగన్ తెరకెక్కించే చిత్రంలో రైనా నటించనున్నారు. ఈ మూవీని డ్రీమ్ నైట్ స్టోరీస్ (డీకేఎస్) అనే కొత్త నిర్మాణ సంస్థ నిర్మించనుంది. ఈ ప్రాజెక్టు అనౌన్స్‌మెంట్ తాజాగా నగరంలో జరిగింది. ఇందులో సురేష్ రైనా వర్చ్యువల్‌గా పాల్గొన్నారు. ఈ మూవీలో ధోనీ నటిస్తారా? అని విలేకరులు రైనాను ప్రశ్నించగా, దీనికి ధోనీనే సమాధానం చెప్పాలి' అని బదులిచ్చాడు. కాగా, నగరంలో జరిగిన ఈ నిర్మాణ సంస్థ ప్రారంభోత్సవంలో భారత క్రికెటర్, సీఎస్కే ఆటగాడు శివం దూబె పాల్గొని చిత్ర బృందానికి విషెస్ తెలిపారు.

## దక్షిణాది నటుల పట్ల వివక్ష లేదు

ప్రియమణి



బాలీవుడ్‌లో దక్షిణాది నటీనటుల పట్ల వివక్షత చూపుతున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని సీనియర్ నటి ప్రియమణి అభిప్రాయపడ్డారు. నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, 'బాలీవుడ్‌లో దక్షిణాది నటీనటుల పట్ల వివక్షత చూపుతున్నాంటూ పలువురు మాట్లాడుకుంటుంటే విన్నాను. నిజానికి నేను కూడా హిందీ చిత్రాల్లో నటించాను. కానీ, ఎక్కడా కూడా నాకు అలాంటి పరిస్థితి ఎదురుకాలేదు. పలు సందర్భాల్లో దక్షిణాది నటీనటులకు బాలీవుడ్ సెలెబ్రిటీలు ఎంతో గౌరవం ఇచ్చారు. బాలీవుడ్ పరిశ్రమ ఎపుడు కూడా దక్షిణాది నటులను అగౌరవపరచలేదు. కాగా విజయ్ హీరోగా నటిస్తున్న 'జన నాయగన్' చిత్రంలో నటించే అవకాశం రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. నేను నటించిన చిత్రాల్లోకెల్లా ఇది ఎంతో స్పెషల్ మూవీ. విజయ్‌తో కలిసి నటించడం ఎంతో ఎగ్జైట్‌మెంట్‌కు గురిచేసింది. ఈ మూవీలో నా పాత్ర చాలా ప్రత్యేకం' అని ఆమె వివరించారు.




జపాన్ బృందానికి స్వాగతం పలుకుతున్న ఐసీజీ బృందం

## చెన్నై చేరిన జపాన్ నౌక

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జపాన్ కోస్ట్‌గార్డ్‌కి చెందిన నౌక 'ఇట్సుకుషిమ' సోమవారం చెన్నై చేరింది. తన గ్లోబల్ ఓషన్ వాయేస్ శిక్షణలో భాగంగా వచ్చిన ఈ నౌక ఇక్కడకు వచ్చింది. ఈ సందర్భంగా ఇండియన్ కోస్ట్‌గార్డ్ (ఐసీజీ), జపాన్ కోస్ట్‌గార్డ్ (జేసీజీ) మధ్య గాఢమైన, శాశ్వత బంధాన్ని నొక్కి చెబుతోంది. ఇది కీలకమైన ఇండో-పసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని, రెండు ప్రఖ్యాత సముద్ర దళాల మధ్య పరస్పర సామర్థ్యాన్ని పెంచుతుందని ఐసీజీ తూర్పు విభాగ ఐజీ దత్విందర్‌సింగ్ షైని పేర్కొన్నారు. చెన్నై చేరుకున్న 'ఇట్సుకుషిమ' కెప్టెన్ నవోకి మిజోగుచి నేతృత్వంలోని జేసీజీ బృందానికి సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికిన అనంతరం దత్విందర్‌సింగ్ మాట్లాడుతూ.. జపాన్ బృందం అధికారిక సమావేశాలు, నౌకల్లో పరస్పర సందర్శనలు, సాంస్కృతిక, వృత్తిపరమైన వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఏడీజీ డోనీ మైఖేల్ తదితరులు కూడా పాల్గొన్నారు.

### సచివాలయం ఎదుట ఉద్యానవనంలో

## రూ.95 లక్షలతో తహర్ మేక విగ్రహం

టి.నగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాల్లో ఒకటైన నీలగిరి తహర్ మేక విగ్రహాన్ని సచివాలయం ఎదుటనున్న ఉద్యానవనంలో ఏర్పాటు చేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నెలాఖరులో ఈ విగ్రహావిష్కరణ జరుగనుంది. ప్రభుత్వ చిహ్నాలుగా శ్రీవిల్లిపుత్తూరు ఆలయ రాజగోపురం, మరకత పక్షి, నీలగిరి తహర్ మేక, పనస, తాటి చెట్టు ఉన్నాయి. క్రీడా చిహ్నంగా కబడీ, నాట్య చిహ్నంగా భరతనాట్యం ఉన్నాయి. ప్రస్తుతం అంతరించిపోతున్న నీలగిరిలో కొండ ప్రాంతాల్లో మాత్రమే ఉన్న తమిళంలో 'వరైయాడు'గా పిలిచే తహర్ మేకలను కాపాడేలా రాష్ట్ర ప్రభుత్వం దానిని ప్రభుత్వ చిహ్నంగా ప్రకటించింది. 2023లో రూ.25 కోట్లతో ఆ మేకల సంరక్షణ పథకాన్ని కూడా చేపట్టింది. నీలగిరిలోని ఆ మేకలకు రేడియో కాలర్ అమర్చి వాటి సంచార ప్రాంతాలను అధికారులు తెలుసుకుంటున్నారు. ప్రభుత్వ చిహ్నంగా ఉన్న ఈ తహర్ మేక విశేషాలు భావితరాలు తెలుసుకునే విధంగా చెన్నై సచివాలయం ఎదురుగా ఉన్న కార్పొరేషన్ పార్కులో రూ.95లక్షలతో తహర్ మేక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆ విగ్రహం చుట్టూ పచ్చికబయళ్లతో అందంగా తీర్చిదిద్దే పనులు కూడా జరుగుతున్నాయి. ఈ విషయమై కార్పొరేషన్ అధికారి ఒకరు మాట్లాడుతూ వరైయాడు విగ్రహాన్ని ఫైబర్ పదార్థాలతో 5 మి.మీ.ల మందంతో తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఆ విగ్రహ ఏర్పాటు పనులు చివరి దశకు చేరాయని, ఈ నెలాఖరులోగా విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. ఇదే విధంగా జల్లికట్టు కీర్తిని ఎలుగెత్తి చాటేలా కాంగేయం ఎద్దు విగ్రహాన్ని కూడా ఈ ఉద్యానవనంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



నీలగిరి తహర్ మేక

### ఘనంగా మంద కృష్ణమాదిగ

## జన్మదిన వేడుకలు

- రామ్‌నగర్‌లో సహాయాల పంపిణీ



కేక్ కట్ చేస్తున్న కర్రా లోకేష్, మొండెం కృష్ణమూర్తి తదితరులు

ప్యారీస్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మహా జన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్పీ), మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆయన 60వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ట్రిప్లికేన్ నియోజకవర్గం రామ్‌నగర్ ఆది ఆంధ్రుల సంక్షేమ భవనంలో ఎమ్మార్పీఎస్ తమిళనాడు అధ్యక్షుడు దర్శిగుంట కిషోర్ అధ్యక్షతన, రాష్ట్ర అధ్యక్షుడు కర్రా లోకేష్, మేకా బాబు, మొండెం కృష్ణమూర్తి తదితరులు కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ 32వ వార్షిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అరుంధతీయులు, ఆదిఆంధ్ర సంఘాల నేతలకు ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్పీ నిర్వాహకులు ప్రజలకు స్వీట్లు, సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు.

### రాష్ట్ర పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో

## 18 నుంచి అమ్మవారి ఆలయాల ఆధ్యాత్మిక యాత్ర

టి.నగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తమిళ ఆడిమాసం (ఆషాఢమాసం) సందర్భంగా నగరం చుట్టూరా ఉన్న అమ్మవారి ఆలయాలను సందర్శించేలా ఒకరోజు ఆధ్యాత్మిక యాత్ర నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 18 నుండి ఆగస్టు 15 వరకు ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాల్లో ఉదయం 8.30 నుండి రాత్రి 8.30 వరకు ఈ యాత్రను రెండు రకాలుగా జరుపనున్నట్లు తెలిపారు.

**ఒకే రోజు 8 అమ్మవారి ఆలయాలు..**

స్థానిక ట్రిప్లికేన్‌లోని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ కార్యాలయం నుండి బయలుదేరి ప్యారీస్‌లోని కాళికాంబాళ్ ఆలయం, రాయపురం అంకాళపరమేశ్వరి ఆలయం, తిరువొత్తియూరు వడివుడైయమ్మన్ ఆలయం, పెరియపాళయం భవానీ అమ్మవారి ఆలయం, పుట్లూరు అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయం, తిరుముల్లై వాయిల్ తిరువడైయమ్మన్ ఆలయం, తిరుముల్లైవాయిల్ పచ్చయమ్మన్ ఆలయం, విల్లివాక్కం బాలియమ్మన్ ఆలయాన్ని దర్శింపజేస్తామన్నారు. ఈ యాత్రకు సంబంధించి రూ.1000లు చార్జి చెల్లించాల్సి ఉంటుందని, సంస్థ మధ్యాహ్న భోజనం సమకూర్చుతుందని వివరించారు.

**ఒకే రోజు 10 అమ్మవారి ఆలయాలు...**

ఇదే విధంగా ట్రిప్లికేన్‌లోని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ కార్యాలయం నుండి ఉదయం 8.30 గంటలకు బయలుదేరి మైలాపూరులోని కర్పగాంబాళ్ ఆలయం, ముండగకన్నియమ్మన్ ఆలయం, కోలవిళియమ్మన్ ఆలయం, తేనాంపేట ఆలయమ్మన్ ఆలయం, టి.నగర్ ముప్పాతమ్మన్ ఆలయం, సైదాపేట పిడారి ఇలంకాళియమ్మన్ ఆలయం, బీసెంట్‌నగర్ అష్టలక్ష్మి ఆలయం, మాంగాడు కామాక్షి అమ్మన్ ఆలయం, తిరువేర్కాడు దేవి కరుమారియమ్మన్ ఆలయం, కీల్పాక్ పాతాళ పొన్నియమ్మన్ ఆలయం వద్ద ఆధ్యాత్మిక యాత్ర ముగుస్తుందని తెలిపారు. ఈ యాత్రకు రూ800లను ఛార్జిగా చెల్లించాలని, మధ్యాహ్న భోజనాన్ని సంస్థ సమకూర్చుతుందన్నారు. ఇతర వివరాల కోసం http://www.ttdconline.com అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. ఇదే విధంగా 180042531111, 044-25333333, 044-25333444 అనే నెంబర్లకు ఫోన్ చేసి వివరాలను తెలుసుకోవచ్చునని సంస్థ అధికారులు తెలిపారు.


### మొగప్పేరులో ఆనందాస్ స్వీట్స్ ప్రారంభం



కొత్తరకం స్వీట్లను పరిచయం చేస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో 25యేళ్ళుగా తినుబండారాల తయారీలో పేరెన్నికగన్న ఆనందాస్ స్వీట్స్ సంస్థ రాజధాని నగరంలో తన మొట్టమొదటి షాపు ప్రారంభించింది. స్థానిక మొగప్పేర్ జేజేనగర్‌లో ప్రారంభించిన ఈ దుకాణంలో సుమారు 200 రకాలకు పైగా స్వీట్లు, హాట్, హల్వా రకాలు అందుబాటులో ఉన్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మణికందన్ పురుషోత్తమన్ ఓ ప్రటకనలో తెలిపారు.

### కోవై కన్యకా పరమేశ్వరి ఆలయ కుంభాభిషేకం



ప్యారీస్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కోవై టౌన్‌హాల్ ప్రాంతంలోవున్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ కుంభాషేకం సోమవారం నేత్రపర్వంగా సాగింది. ఉదయం 6.30 గంటల నుంచి యాగశాలలో పవిత్ర జలాల కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు, రాజగోపురం, కలశాలు, మూలవర్లు, పరివార దేవతల విమాన గోపురాలకు కుంభాభిషేకం నిర్వహించారు. మంగళవారం నుంచి ఈఆలయంలో 48రోజుల మండల పూజలు ప్రారంభమవుతాయి. ఈ వేడుకల్లో ఆలయ చైర్మెన్ సురేష్‌బాబు, తులసీదాస్, విజయ్ కుమార్, శబరినాథ్, నేతాజీ, ముత్తు వెంకటరామ్‌లతోపాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### కోటమారియమ్మన్ రథం

## ట్రయల్ రన్

**హాజరైన అశేష భక్తజనం**

ప్యారీస్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సేలం కోటమారియమ్మన్ ఆలయంలో సోమవారం ఉదయం రథం ట్రయల్ రన్ జరిగింది. వందలాది మంది భక్తులు రథం తాడులాగారు. సేలం నగరంలో పురాతన కోటమారియమ్మన్ ఆలయానికి ఇప్పటివరకు పెద్దరథం లేనందువల్ల పల్లకీల్లో మాత్రమే అమ్మవారిని ఊరేగించేవారు. ఈ నేపథ్యంలో, భక్తుల దీర్ఘకాల కోరిక మేరకు కలపతో కొత్తరథాన్ని నిర్మించనున్నట్లు హిందూ దేవాదాయశాఖ ప్రకటించింది. ఆ మేరకు 40 అడుగుల ఎత్తులో నాలుగు ఇనుప చక్రాలతో రథాన్ని అందంగా రూపొందించారు. ఇందులో 25 అడుగుల ఎత్తుకు అలంకారాలు, 15 అడుగుల ఎత్తులో సింహాసనం, 250 దేవతామూర్తుల ప్రతిమలు ఏర్పాటు చేసి సోమవారం ఉదయం అశేషభక్త జనం మధ్య రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రాజేంద్రన్ ట్రయల్ రన్ ప్రారంభించారు. వాయిద్య కళాకారులు, నృత్యకళాకారులు, దేవతామూర్తుల వేషంలో భక్తులు పాల్గొని సందడి చేశారు. అమ్మవారి ఆలయ ప్రవేశద్వారం నుంచి కదిలిన రథం అగ్రహారం, రథవీధి, పట్టకోవిల్, బజారువీధి మీదుగా సాగింది. రథం ట్రయల్ రన్ సందర్భంగా అగ్రహారం ప్రాంతంలో వాహనాల రాకపోకలను మార్పు చేయడంతో పాటు విద్యుత్ సరఫరా కూడా తాత్కాలికంగా నిలిపివేశారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



కోయంబత్తూరు నగరాభివృద్ధికి మాస్టర్ ప్లాన్-2041 ప్రకటించినందుకు సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ని కలిసి ధన్యవాదాలు తెలుపుతున్న క్రెడాయ్ సంస్థ చైర్మన్ ఎస్ఆర్ అరవింద్‌కుమార్



తూత్తుకుడి కలైంజర్ అరంగంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు రెట్టమలై శీనివాసన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి గీతా జీవన్, ఎంపీ కనిమొళి తదితరులు



సహజవనరుల శాఖ పనితీరుపై సచివాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

## 14న మీనాక్షి అమ్మవారి ఆలయం మూసివేత



చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మదురై మీనాక్షి అమ్మవారి ఆలయాన్ని ఈ నెల 14న మూసివేయనున్నట్లు ఆలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. తిరుప్పరంకుండ్రంలోని మురుగన్ ఆలయ కుంభాభిషేక వేడుకలు ఆ రోజునే జరుగనున్నాయి. మదురై నగరవాసులంతా మీనాక్షి అమ్మవారు, సుందరేశ్వర స్వామి వారిని తల్లిదండ్రులుగానే భావించి ఆరాధిస్తుండటం ఆనవాయితీ. ఆ ప్రకారమే ఆదిదంపతులైన మీనాక్షి, సుందరేశ్వరులు తమ పుత్రుడైన మురుగన్ ఆలయంలో జరిగే కుంభాభిషేక వేడుకలను తిలకించేందుకు తిరుప్పరంకుండ్రం బయలుదేరి వెళ్తున్నారు. ఈ నెల 13 సాయంత్రమే ఆదిదంపతులు సర్వాలంకరణ శోభితంగా తిరుప్పరంకుండ్రం ఆలయానికి చేరుకోనున్నారు. మరుసటి రోజు జరిగే కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న అనంతరం సాయంత్రం పంచమూర్తుల ఊరేగింపులోనూ పాల్గొంటారు. ఆ తర్వాత రాత్రి ఆదిదంపతులు మదురై ఆలయానికి చేరుకుంటారు. ఈ కారణంగానే ఈ నెల 14న మీనాక్షి అమ్మవారి ఆలయాన్ని రోజంతా మూసివేయనున్నామని ఆలయ అధికారులు తెలిపారు.

### వల్లకోట్టై ఆలయ కుంభాభిషేకంలో

## టీఎన్‌సీసీ చీఫ్‌కు చేదు అనుభవం



ఆలయ గోపురంపై సెల్వపెరుంతగై పక్కనే జెండా ఊపుతున్న దేవాదాయశాఖ అధికారి. ఆలయం దిగువ సెల్వపెరుంతగైని అడ్డుకుంటున్న అధికారులు

చెన్నై, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శ్రీపెరుంబుదూరు సమీపంలోని వల్లకోట్టైలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం జరిగిన కుంభాభిషేక వేడుకలకు వెళ్ళిన టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగైకి చేదు అనుభవం ఎదురైంది. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు బీజేపీ మహిళా నాయకురాలు తమిళిసై సౌందరరాజన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై వేకువజామునే ఆ ఆలయానికి చేరుకున్నారు. 17 యేళ్ల తర్వాత జరుగుతున్న ఆ వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్ళిన తమిళిసైని ఆలయ నిర్వాహకులు సాదరంగా ఆహ్వానించి ఆలయంలోకి తీసుకెళ్లారు. అయితే సెల్వపెరుంతగైని మాత్రం అడ్డుకున్నారు. శ్రీపెరుంబుదూరు నియోజకవర్గం శాసనసభ్యుడిగా, ప్రధాన ప్రతిపక్షనేతగా కేబినెట్ ర్యాంక్ కలిగిన సెల్వపెరుంతగై కుంభాభిషేక వేడుకలకు వస్తున్న విషయాన్ని ఆలయ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదు. ఆలయ గోపుర కలశాలకు సంప్రోక్షణ జరుగుతున్న ప్రాంతానికి తమిళిసైని అనుమతించిన దేవాదాయశాఖ అధికారులు, నిలిచేందుకు స్థలం లేదంటూ గోపురంపైకి సెల్వపెరుంతగైని అనుమతించలేదు. పావుగంట గడిచాక దేవాదాయ శాఖ అధికారులు ఆయనను గోపురంపైకి వెళ్లేందుకు అనుమతించారు. ఆ తర్వాత గోపురకలశాలకు సంప్రోక్షణ చేసే సమయంలో స్థానిక శాసనసభ్యుడు, ఆ ప్రాంతానికి చెందిన మంత్రి లేదా ప్రభుత్వ ఉన్నతాధికారులు జెండా ఊపటం ఆనవాయితీ. ఆ సంప్రదాయం ప్రకారం గోపురంపైకి ఎక్కిన సెల్వపెరుంతగై ఆ జెండా ఊపాల్సి ఉండగా దేవాదాయ శాఖ అధికారే ఆ పని కానిచ్చేశారు. ఇదంతా సెల్వపెరుంతగై బలహీన వర్గానికి చెందినవారనే కారణంగా జరిగిందని అందరూ భావిస్తున్నారు.

**2వేల యేళ్లుగా కొనసాగుతున్న తారతమ్యాలు...**

ఈ సంఘటన గురించి సెల్వపెరుంతగై మీడియాతో మాట్లాడుతూ వల్లకోట్టై మురుగన్ ఆలయ కుంభాభిషేక వేడుకలు ఘనంగా జరిపారని, అందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. తిరుచెందూరులో కుంభాభిషేకం పకడ్బందీ ఏర్పాట్ల నడుమ మంత్రి శేఖర్‌బాబు స్వయంగా పాల్గొని నిర్వహించారని, అయితే ఇక్కడ దేవాదాయ శాఖ అధికారులు మెతకవైఖరి అవలంభించారని చెప్పారు. ఎవరిని ఎవరు కట్టడి చేయాలో తెలియటం లేదని, తమిళిసై సౌందరరాజన్‌ను అనుమతించి తనను ఎందుకు అడ్డుకున్నారో తెలియటం లేదన్నారు. రెండువేల సంవత్సరాలుగా ఈ తారతమ్యాలు పాటిస్తూనే ఉన్నారని, రాత్రికి రాత్రే ఈ తారతమ్యాలు మాయం కాలేవని చెప్పారు. తామంతా సామాన్య భక్తులతో నిలిచి వేడుకలను చూశామని చెప్పారు. ఈ సమస్యను సీరియస్‌గా తీసుకుని రాష్ట్రంలో చక్కటి పాలన అందిస్తున్న ప్రభుత్వానికి చెడ్డపేరు రాకూడదనే సహనం పాటించామన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్, దేవాదాయ శాఖమంత్రి శేఖర్‌బాబుకు కళంకం రాకూడదనే ప్రజలతో మమేకమై వేడుకలను చూశానని చెప్పారు. భగవంతుడిని తాను చూడలేకపోయానని, అయినా భక్తులందరినీ దేవుని చూసి రమ్మని చెబుతూ వచ్చానని తెలిపారు. అధికారులు తమను నేతలుగా భావించకపోవడం వల్లే ఇన్ని సమస్యలు వస్తున్నాయని, ఏది ఏమైన భక్తులు సంతోషంగా ఉంటే తనకూ సంతోషమేనని ఆయన చెప్పారు.



తమిళనాడు గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

## శ్రీవారి సేవలో తమిళనాడు గవర్నర్

తిరుమల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణన్ రవి సోమవారం ఉదయం బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్, ఇండియన్ మిలటరీ అధికారి పరమవీర్‌చక్ర అవార్డు గ్రహీత యోగేంద్ర సింగ్ యాదవ్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.




ఆర్పీ ఠాకూర్



యోగేంద్ర సింగ్ యాదవ్

## సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.39 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 88,938

తలనీలాలు సమర్పించినవారు: 28,548



# 67,988 టన్నుల తోతాపురి కొనుగోలు

- 10,046 మంది మమిడి రైతులకు ప్రయోజనం
- చివరి పంట వరకూ రాయితీ అందిస్తామన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 7(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో ఈనెల నాటికి 67,988 టన్నుల తోతాపురి రకం మామిడి కాయలు కొనుగోలు అయ్యాయి. వీటిలో 45,338 టన్నులను మామిడిగుజ్జు పరిశ్రమలు సేకరించగా, మిగిలిన 22,650 టన్నులను ర్యాంపులు, మండీల్లో విక్రయించారు. తద్వారా 10,046మంది రైతులకు ప్రయోజనం చేకూరింది' అని కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం వివరించారు. మామిడి రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు. తోతాపురి మామిడి సేకరణ ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. నిర్దేశిత ధరకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమల వద్ద క్యూలైన్లలో వేచి ఉన్న ట్రాక్టర్లు, ట్రక్కుల డ్రైవర్లు, రైతులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించామన్నారు. తోతాపురి మామిడి సేకరణ కోసం బ్యాంకులు 20 ప్రాసెసింగ్ యూనిట్లకు టాప్ ఆప్ మొత్తాన్ని ఇచ్చాయని, రైతులు తమ మొత్తం దిగుబడిని అమ్మవచ్చని తెలిపారు. చివరి పంట వరకూ ప్రభుత్వం తరపున రైతులకు రూ.4సబ్సిడీ ఇస్తామన్నారు. లీజుకు తీసుకున్న రైతులకూ ఇది వర్తిస్తుందన్నారు. ఆగస్టు నెలాఖరు వరకు తోతాపురి మామిడి కొనుగోలు జరుగుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 80వేల హెక్టార్లలో తోతాపురి మామిడి సాగులో ఉండగా, తిరుపతి జిల్లాలో 14,582 హెక్టార్ల విస్తీర్ణంలో 1.5లక్షల టన్నుల తోతాపురి ఉత్పత్తి ఉంటుందన్నారు. తోతాపురి మామిడి కిలో రూ.12 ధర నిర్ణయించడం జరిగింది. మామిడిగుజ్జు పరిశ్రమలు రూ.8, ప్రభుత్వం రూ.4 అందజేయడం జరుగుతుందన్నారు.

## గోవిందరాజస్వామి ఆలయంలో కవచ ప్రతిష్ఠ



తిరుపతి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో జ్యేష్టాభిషేకంలో భాగంగా రెండో రోజైన సోమవారం కవచ ప్రతిష్ఠ క్రతువు వేడుకగా జరిగింది. ఉదయం శతకలశ స్నపనం, మహాశాంతిహోమం చేపట్టారు. ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సమర్పణ, ఆరగింపు, అనుగ్రహం వంటి కైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం ఉత్సవర్లు తిరుచ్చిపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దజియ్యంగార్, చిన్నజియ్యంగార్, ఆలయ డిప్యూటీఈవో శాంతి, ఏఈవో మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సత్యప్రసాద్

### మా భూమిని వేరేవారు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు..



'సార్! నా పేరు భారతి. తిరుపతి ఐఎస్ మహల్ వద్ద ఉంటున్నాం. నా భర్త ఆనంద్ 2023 జనవరిలో ప్రమాదవశాత్తు మరణించారు. ముగ్గురు పిల్లలున్నారు. ఎలాంటి ఆదాయమూ లేదు. తిరుపతి రూరల్ మండలం చిగురువాడ ఉత్తరపుకండ్రిగ వద్ద ప్లాట్ ఉంది. నా భర్త మరణించిన 4వ రోజే వేరే వ్యక్తి ఆ ప్లాట్‌ను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు' అని మంత్రి దృష్టికి తెచ్చింది. ఇదే విషయాన్ని గతంలో మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా రిజిస్ట్రేషన్ రద్దు చేసి న్యాయం చేయాలని ఆదేశించారని గుర్తు చేశారు. స్పందించిన మంత్రి జిల్లా రిజిస్ట్రేషన్ అధికారులను పిలిచి సమస్యను వెంటనే పరిష్కరించి, బాధితురాలికి న్యాయం చేయాలని ఆదేశించారు.

# ప్రతి అర్జీకీ సమాధానమివ్వండి

**పీజీఆర్ఎస్ ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనన్న అనగాని - కలెక్టరేట్‌లో వినతులు స్వీకరించిన మంత్రి**

తిరుపతి (కలెక్టరేట్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించడానికే పీజీఆర్ఎస్ ఉందని, ఇందులో వచ్చే ప్రతి అర్జీకి సమాధానం ఇవ్వాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం డిస్ట్రిక్ట్ విజన్ యాక్షన్ ప్లాన్, పీ4పై సమీక్షించడానికి అనగాని సత్యప్రసాద్ జిల్లా అధికారులతో సమీక్షించడానికి విచ్చేశారు. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలు ఒక్కొక్కరికిగా తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి నేరుగా వినతులను స్వీకరించారు. స్టేజ్ కిందనే కూర్చుని ఉన్న దివ్యాంగులతో నేలపై కూర్చుని వారి సమస్యలు తెలుసుకున్నారు. సహాయ పరికరాలు ఇవ్వలేదని, నిరుపేదలైన దివ్యాంగులకు ప్రభుత్వం షాపింగ్ కాంప్లెక్సులో కొన్ని గదులు కేటాయించి జీవనోపాధి కల్పించాలని, త్రీవీలర్ బ్యాటరీ సైకిళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని పీడబ్ల్యూడీ ఫెడరేషన్ నాయకులు సుబ్రహ్మణ్యం, మస్తాన్ సాహెబ్ మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని పక్కనే ఉన్న కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 284 అర్జీలు అందాయి. అందులో అత్యధికంగా 149 రెవెన్యూకు సంబంధించినవే ఉన్నాయి. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నగరపాలక సంస్థ కమిషనర్2 మౌర్య, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, రోష్మాండ్, ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



### పెరుమాళ్లపల్లెను ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలి

తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె గ్రామాన్ని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా విభజించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి టీడీపీ మండలాధ్యక్షుడు ఈశ్వర‌రెడ్డి, గ్రామస్థులు మంత్రిని కోరారు. పెరుగున్న జనాభా, భౌగోళిక విస్తీర్ణం కారణంగా ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేసి, సర్వే నంబర్లు కూడా విభజించాలన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

### నా ఇంటి స్థలం కబ్జా చేశారు



బెంగళూరులో ఉన్న కుమార్తె ఇంటికి పోయి వచ్చే లోపు నా ఇంటి జాగాను గ్రామానికి చెందిన లీలావతి కుటుంబీకులు ఆక్రమించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు కూడా కూడా ఆక్రమించిన కుటుంబానికే అండగా నిలుస్తున్నారు. నిరుపేద దళితురాలినైన నన్ను బెదిరిస్తున్నారు. న్యాయం చేయండి.

- తలారి రాజేశ్వరి, కొంగరవారిపల్లె, చంద్రగిరి మండలం

### పింఛను ఇప్పించండి



అయ్యా! కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడిని. ఏడు నెలల క్రితం పక్షవాతంతో కాళ్లు, చెయ్యి పడిపోయాయి. కుటుంబ పోషణ కష్టంగా మారింది. పింఛను ఇచ్చి ఆదుకోండి.

- డి.అయ్యర్, తిరుపతి రూరల్

# అభివృద్ధిలో జిల్లాను మొదట నిలుపుదాం

## ఐదు రంగాల్లో వనరులు, అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**బంగారు కుటుంబాల అభివృద్ధికి శ్రద్ధ చూపాలి ● ప్రజాప్రతినిధులు, అధికారులకు ఇంఛార్జి మంత్రి పిలుపు**



ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అనగాని

తిరుపతి, జూలై7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో జిల్లాను మొదటి స్థానంలో నిలపడానికి ఐదు ప్రధాన రంగాల్లోని వనరులను, అవకాశాలను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం మధ్యాహ్నం జరిగిన జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సమావేశంలో పీ4 సర్వే, బంగారు కుటుంబాల అభివృద్ధి తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. 'జిల్లాలో పీ4 సర్వేలో 80,331 బంగారు కుటుంబాలను గుర్తించాం. ఇప్పటి వరకూ ఐదు మంది దాతలు 1911 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అంగీకరించారు' అని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. 'సీఎం చంద్రబాబు రూపొందించిన విజన్ 2047 డాక్యుమెంట్‌లో భాగంగా 2029 నాటికి జిల్లాను ఎంత వరకూ అభివృద్ధి పరచగలమో ఆలోచించండి. విజన్ యాక్షన్‌ప్లాన్ ద్వారా చరిత్రలో తొలిసారి ఎమ్మెల్యేలకు నియోజకవర్గ స్థాయిలో కార్యాలయాలు ఏర్పాటవుతున్నాయి' అని మంత్రి అనగాని వివరించారు. తిరుపతిలో పేదలు నిర్మించుకున్న ఇళ్లకు జీవో 30 అమలు చేసేలా స్పెషల్ డ్రైవ్ పెట్టాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, ఏపీ హస్తకళల అకాడమీ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, జేసీ శుభం బన్సాల్, కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పలు అంశాలు ప్రస్తావించగా, మంత్రి, కలెక్టర్ స్పష్టత ఇచ్చారు.

### సీఎస్ఆర్ నిధుల వ్యయంలో పారదర్శకత ఏదీ?

'శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పరిశ్రమలు ఎక్కువ ఉన్నాయి.సీఎస్ఆర్‌కింద ఎన్ని నిధులు ఇస్తున్నాయి? ఎక్కడ ఖర్చు చేస్తున్నారనే అంశంలో పారదర్శకత ఉండటంలేదు. ఆవివరాలు ఆన్‌లైన్‌లో పెట్టాలి. కొంత శాతాన్ని స్థానిక నియోజకవర్గంలో ఖర్చు చేయాలి'అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు.

### బంగారు కుటుంబాల జాబితా ఇవ్వండి

'పీ4 సర్వే ద్వారా గుర్తించిన బంగారు కుటుంబాల జాబితా ఎమ్మెల్యేలకు ఇవ్వాలి. పరిశ్రమలు సీఎస్ఆర్ కింద ఇస్తున్న నిధుల వివరాలు ఇవ్వడంతో పాటు యజమానులతో సమావేశం ఏర్పాటు చేస్తే బాగుంటుంది' అని ఎమ్మెల్యే సునీల్ కుమార్ అభిప్రాయపడ్డారు.

### సీఎస్ఆర్ నిధులతో రోడ్లు బాగు చేయాలి

'శ్రీసిటీలో 220.. వెలుపల అపోలో, హీరో, క్రాప్రికార్న్ వంటి పరిశ్రమలూ ఉన్నాయి. సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గంలోని రోడ్లు బాగు చేయాలి. పర్యాటక ప్రాంతాల్ని అభివృద్ధి పరచాలి. మోటర్ బైక్ ఉంటే బంగారు కుటుంబాల జాబితా నుంచి తొలగించడం సరికాదు' అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు.

### పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపండి

'వెంకటగిరి నియోజకవర్గంలో భూములున్నా పారిశ్రామిక వాడలు ఏర్పాటు కాలేదు. దీనిపై చొరవ చూపాలి. ప్రత్యామ్నాయంగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి పరచాలి' అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు.

### టెంపుల్ టూరిజంపై దృష్టి పెట్టాలి

'తిరుపతిలో పరిశ్రమలు, వ్యవసాయం, ఐటీ కంపెనీలూ లేవు. ఉన్నదల్లా సర్వీస్ సెక్టర్ మాత్రమే. టెంపుల్ టూరిజం అభివృద్ధి పరచాలి. దానికి కమిటీ వేసి నిపుణులను నియమించాలి' అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు.

### పారిశుధ్యం అధ్వానం

'తిరుపతిలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది.. ప్రజల ఆరోగ్యం దెబ్బతినేలా వుంది. వీధుల్లో రోడ్లు, డ్రైన్లు సక్రమంగా లేవు. ప్రత్యేక నిధులు కేటాయించి పరిస్థితిని మెరుగుపరచాలి' అని ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ విజ్ఞప్తి చేశారు.

### ఇళ్లను క్రమబద్ధీకరిస్తే రూ. 400 కోట్లు

'తిరుపతి రూరల్ మండలంలో మఠం భూములను కొని 30 ఏళ్ళ కిందట ఇళ్ళు కట్టుకున్నారు. ప్రభుత్వం రోడ్లు, కాలువలు నిర్మించి కరెంటు కూడా ఇచ్చింది. మఠం భూములనే పేరుతో నిషేధిత జాబితాలో పెట్టారు. దాంతో రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. నిషేధిత జాబితా నుంచీ ఆ భూములను తొలగించి క్రమబద్ధీకరిస్తే ప్రభుత్వానికి రూ. 400 కోట్ల వరకూ ఆదాయం వస్తుంది. కావాలంటే మఠానికి ప్రత్యామ్నాయ భూములిస్తాం' అని ఎమ్మెల్యే పులివర్తి నానీ సూచించారు.

### నైపుణ్య శిక్షణలో ఎస్వీయూ సహకారం

'యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ఎస్వీయూ సహకరిస్తుంది. ఇప్పటికే డ్రోన్ అండ్ స్పేస్ టెక్నాలజీ అంశంలో ఎంవోయూ కుదుర్చుకున్నాం. తిరుపతి, పరిసర ప్రాంతాల్లో డ్రోన్ వినియోగంపై శిక్షణ, ఆపరేషన్, రిపేర్లు వంటివి చేపడతాం. ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు శిక్షణ ఇస్తాం' అని వీసీ అప్పారావు పేర్కొన్నారు.

### మహిళాభివృద్ధికి తోడ్పాటు

'మహిళలకు ఉన్నత విద్య, నైపుణ్య శిక్షణకు పద్మావతీ వర్సిటీ తోడ్పడుతుంది. ఏఐ, ఫ్యాషన్ టెక్నాలజీ తదితరాలపై దృష్టి పెడుతున్నాం. ఇప్పటికే 47 స్టార్టప్‌లు వున్నాయి. మహిళా బయోటెక్ పార్కు వుంది. తిరుపతిలో రెండు మురికివాడలు కేటాయిస్తే విద్యార్థులను పంపి పరిస్థితులు మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తాం. ఇంటర్న్‌షిప్స్ నిర్వహిస్తాం. పూర్వ విద్యార్థులను పీ4లో భాగస్వాముల్ని చేస్తాం' అని వీసీ ఉమా తెలిపారు.

# విద్యార్థులు.. ఉపాధ్యాయులు 100శాతం హాజరు

- రాష్ట్రంలో జిల్లా విద్యాశాఖ రికార్డ్



100 శాతం హాజరు పోస్టర్లను ప్రదర్శిస్తున్న డీఈవో

తిరుపతి(విద్య), జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ రాష్ట్ర స్థాయిలో అరుదైన రికార్డ్‌ను సాధించింది. అన్ని పాఠశాలల్లో నమోదైన విద్యార్థులు, అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సోమవారం వందశాతం పాఠశాలలకు హాజరయ్యారని డీఈవో కేవీఎన్ కుమార్ వెల్లడించారు. పాఠశాలలు ప్రారంభమైన కొద్దిరోజుల్లోనే... ఈ అరుదైన రికార్డును సాధించడంపట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 100 శాతం హాజరు నమోదు చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ నిత్యం వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా మార్గనిర్దేశం చేస్తూ వచ్చారని... ఆమేరకు రాష్ట్రంలో జిల్లా ఆ ఘనతను సాధించందన్నారు. ఉన్నతాధికారులు డీఈఓ ఇతర అధికారులను అభినందించారు. 100 శాతం హాజరుకు కృషి చేసిన అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు డీఈవో కుమార్, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.గౌరీశంకర్‌రావు, ఫషియల్ అటెండెన్స్ నోడల్ అధికారి జి.సురేష్ అభినందనలు తెలియజేశారు.

# భరతనాట్యంలో వరల్డ్ రికార్డు



వరల్డ్‌రికార్డు సర్టిఫికెట్లు చూపుతున్న బాలికలు

తిరుపతి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): నటరాజ నర్తన ఆకారంలో 27.32 నిమిషాల పాటు భరతనాట్యంతో తిరుపతికి చెందిన బాలికలు వరల్డ్ రికార్డును కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తమిళనాడు సేలంలోని కైలాస మానససరోవరం స్కూల్‌గ్రౌండ్‌లో ఇంటర్ నేషనల్ టైమ్స్ అండ్ వరల్డ్ రికార్డు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం భరతనాట్యంలో 'నటరాజ నర్తనం' ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2వేల మంది బాల కళాకారులు ప్రాతినిథ్యం వహించారు. అందులో తిరుపతి నుంచి సింహల లేక్షణ సాయి, కందుల హవిష, బి.ప్రశ్వితశ్రీ, సి.కేతన పాల్గొని నటరాజనర్తన ఆకారంలో 27.32నిమిషాలు నృత్యం చేసి ఆహుతులను అబ్బురపరిచారు. తమిళ సినీనటి, క్లాసికల్ డ్యాన్సర్ ప్రియదర్శిని చేతుల మీదుగా నలుగురు బాలికలు ప్రశంసపత్రాలు, బహుమతులు అందుకున్నారు.

# ఆగస్టు 7న గోవాలో జాతీయ ఓబీసీ మహాసభ

తిరుపతి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): గోవాలోని శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో వచ్చేనెల ఏడో తేదీన జాతీయ ఓబీసీ మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, కేశన శంకరరావు తెలిపారు. తిరుపతిలోని పద్మావతి గెస్ట్‌హౌస్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి, బీసీ డిమాండ్ల సాధన కోసం, భవిష్యత్తు కార్యచరణను రూపొందిస్తామన్నారు. ఈనెల 21నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాలలో ఈ బిల్లుపై చర్చించి చట్టసభలలో బీసీలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. 2026లోనే కులగణన పూర్తిచేసి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని కోరారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో విద్య, ఉద్యోగాలలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని సరిదిద్దే బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలన్నారు. సభకు ప్రధాని మోదీ, మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు, అఖిలపక్ష పార్టీల అధ్యక్షులు, జాతీయస్థాయి నేతలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతికుమార్‌యాదవ్ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం వాటా కోసం పోరాటానికి బీసీలందరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొబ్బినేని రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖరాచారి తదితరులు పాల్గొన్నారు.